ప్రజాశక్తి
గురువారం 25 మే 2023
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

మూలకు చేరిన MRI స్కాన్!

- కెజిహెచ్‌లో ఏడాదిన్నరగా రోగులకు తప్పని అవస్థలు...
- రాష్ట్ర ప్రభుత్వమే స్పందించాలి : వైద్యాధికారులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

పేదల పెద్దాసుపత్రి కెజిహెచ్‌లో ఎంఆర్‌ఐ స్కాన్ తీసే పరికరం ఏడాదిన్నర కాలంగా మూలకు చేరింది. రోజుకు కనీసం 50 నుంచి 60 మంది వరకూ ఎంఅర్‌ఐ స్కాన్ కోసం కెజిహెచ్‌కు ఎక్కడెక్కడి నుంచో రోగులు వస్తుంటారు. కానీ ఈ పరికరం అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్ ఆసుపత్రే వీరికి గతవుతోంది. దీనిపై ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా ఎలాంటి స్పందనా రాలేదని వైద్యాధికారులు పలువురు వాపోతున్నారు.

రూ.2 కోట్లు పైమాటే...

ఎంఆర్‌ఐ స్కాన్ ఖరీదు దాదాపు రూ.కోటిన్నర నుంచి రూ.రెండు కోట్ల పైమాటే అని వైద్య నిపుణులు చెబుతున్నారు. ప్రభుత్వం, జిల్లా రాజకీయ ప్రముఖులు తలచుకుంటే పెద్ద కష్టమేమీ కాదంటూ పలువురు వైద్యాధికారులు వెల్లడిస్తున్నారు. ఎంఆర్‌ఐ స్కాన్ కెజిహెచ్ రిఫరల్‌లో ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉన్నా ఆ దిశగా యంత్రాంగం కూడా చర్యలు తీసుకోవడం లేదని తెలుస్తోంది. నిత్యం కెజిహెచ్‌కు వచ్చే రోగులంతా దగ్గరోలగల విశాఖ మెడికల్ సెంటర్, లాస్య డయాగ్నోస్టిక్స్, విజయమెడికల్ సెంటర్‌లకు తరలివెళ్తున్నారు. ఎంఆర్‌ఐ స్కాన్ల కోసం ప్రైవేట్‌పై ఆధారపడేలా ప్రజానీకాన్ని ప్రభుత్వం, వైద్యాధికారులు చేశారంటూ పలువురు కెజిహెచ్‌లో ఆవేదన చెందుతున్నారు.

పర్సంటేజీలు రావడంతో పట్టడం లేదా?

ఎంఆర్‌ఐ స్కాన్ చేయించాలంటే కనీసం రూ.5వేల నుంచి రూ.8వేల వరకూ వసూలు చేస్తున్నారు. రోగుల నుంచి వసూలు చేసిన మొత్తంలో 20 నుంచి 40శాతం వరకు రిఫర్ చేసిన డాక్టర్లకు లేదా కెజిహెచ్ సిబ్బందికి పర్సంటేజీలు కూడా వెళ్తున్నాయన్న ప్రచారం జోరుగా సాగుతోంది. దీంట్లో దళారుల పాత్ర కూడా ప్రముఖంగా ఉందన్నది రోగులే చెబుతున్నారు.

చెక్కు అందిస్తున్న విశాఖపట్నం జిల్లా కలెక్టర్ మల్లికార్జున

జగనన్న విద్యా దీవెన పంపిణీ

విశాఖ జిల్లాలో 41075, అనకాపల్లి జిల్లాలో 37,348 మందికి లబ్ధి

ప్రజాశక్తి-యంత్రాంగం

కలెక్టరేట్, విశాఖ : జగనన్న విద్యా దీవెన పథకం కింద విశాఖ జిల్లాలో 41,075 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరిందని, వీరందరికీ ఈ పథకం కింద రూ.37 కోట్ల మేర ప్రయోజనం కలిగిందని విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. జగనన్న విద్యా దీవెన కింద జనవరి - మార్చి త్రైమాసికానికి రాష్ట్రస్థాయిలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో బుధవారం ప్రారంభించగా, జిల్లా

మిగతా 2లో..

చెక్కు అందిస్తున్న అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పఠాన్ శెట్టి

నేడు జివిఎంసి స్థాయీ సంఘ సమావేశం

అజెండాలో 47 అంశాలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

గ్రేటర్ విశాఖపట్నం నగరపాలక సంస్థ (జివిఎంసి) స్థాయీ సంఘం సమావేశం జివిఎంసి ప్రధాన కార్యాలయంలో గురువారం ఉదయం 11 గంటలకు ప్రారంభంకానుంది. 47 అంశాలను అజెండాగా పాలకులు చేర్చారు. జివిఎంసి నగర మేయర్ సహా 9 మంది స్థాయీ సంఘ సభ్యులు ఈ సమావేశానికి హాజరుకానున్నారు. అద్దెల వసూళ్లు, ఆశీలు, షాపుల లీజుల వ్యవహారాలు, రెన్యువల్ వంటి అంశాలే అజెండాగా ఉన్నాయి. ముడసర్లోవ పార్కులో ప్రవేశ రుసుము ప్రజలకు పెట్టేందుకు ఇప్పటికే తీర్మానం ఆమోదించడమైనది. 47 అజెండాలపైనా అధికార పార్టీ స్టాండింగ్ కమిటీ సభ్యులు చర్చించనున్నారు.

మధ్యాహ్న వేళల్లోనూ ఒపి సేవలు

వార్త 4లో..

ప్రపంచ మార్పులపై దృష్టి సారించాలి

వార్త 2లో..

అక్రమ కేసులపై ఆటో కార్మికుల నిరసన

వార్త 4లో..

'సంసద్ ఆదర్స్' ద్వారా అభివృద్ధి పనులు

విశాఖ కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : సంసద్ ఆదర్స్ గ్రామ యోజన (ఎస్ఎజివై) ద్వారా గ్రామాల్లో పురోగతిలో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం పార్లమెంట్ సభ్యులు ఎంవివి.సత్యనారాయణ అధ్యక్షతన సంసద్ ఆదర్స్ గ్రామ యోజన పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామ సర్పంచులు స్థానిక ఎంపిటిసి, ఎంపిపి సహకారంతో సంసద్ ఆదర్స్ గ్రామ యోజనలో చేయాల్సిన పనులు గుర్తించి సంబంధిత ప్రతిపాదనలను ఎండిఒలకు అందజేయాలన్నారు. ఎండిఒలు పార్లమెంట్ సభ్యులకు అందజేస్తే ఎంపీ నిధుల ద్వారా పనులు మంజూరవుతాయని చెప్పారు.

ఎంపీ ఎంవివి.సత్యనారాయణ మాట్లాడుతూ, గ్రామాలలో ఎండిఒ సర్వేచేసి అవసరమైన పనులు గుర్తించాలన్నారు. స్థానికంగా అందుబాటులో ఉన్న నిధుల లభ్యతను బట్టి కేటాయింపు చేసి మిగిలిన పనులకు తగు ప్రతిపాదనలు పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి శ్రీరామమూర్తి, జిల్లా అధికారులు, అనంతవరం, పద్మనాభం, మద్ది, ఆనందపురం, గండిగుండం, వెళ్లంకి గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపీ ఎంవివి.సత్యనారాయణ

వారసులకు ఉద్యోగాలివ్వాలి

జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన రెండు రోజుల రిలే దీక్ష ప్రారంభం

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : జివిఎంసిలో పారిశుధ్య పనులు చేస్తూ చనిపోయిన, 60 ఏళ్లు పూర్తయిన, లాంగ్ ఆబ్సెంట్ అయిన కార్మికుల వారసులను జివిఎంసిలో కొత్తగా నియామకాలు చేస్తున్న 482 పోస్టులలో నియమించాలని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షుడు టి.నూకరాజు, ప్రధాన కార్యదర్శి యు.రాజు డిమాండ్ చేశారు. జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద యూనియన్ ఆధ్వర్యాన రెండు రోజులపాటు చేపట్టే రిలే దీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, యుజిడి, వాటర్ సప్లయ్ విభాగాలలో పనిచేసి మరణించిన వారి, 60 ఏళ్లు నిండిన వారి కుటుంబాల్లో వారికి కూడా ఉద్యోగాలు కల్పించాలన్నారు. జివిఎంసికి జీవితాలను ధారబోసి పనిచేసిన కార్మికుల కుటుంబాలను విస్మరించి కొత్తవారికి ఉపాధి కల్పించడం సరికాదన్నారు. ఇటీవల జివిఎంసిలో 300 మందిని కొత్తగా నియమించారని, వారందరినీ తక్షణం తొలగించాలని డిమాండ్ చేశారు. లేకుంటే సమ్మె తప్పదని హెచ్చరించారు. కార్మికులపై వేధింపులు ఆపాలని కోరారు. దీక్షల్లో యూనియన్ డిప్యూటీ కార్యదర్శి ఎంవి.ప్రసాదరావు, ఉపాధ్యక్షుడు ఎస్.రమణ, కార్యదర్శి జె.నాయుడు, ఎం.ఈశ్వరరావు, ఎస్.గణేష్, రత్నం, సత్యవతి, రాజు తదితరులు పాల్గొన్నారు.

దీక్షలను ఉద్దేశించి మాట్లాడుతున్న యూనియన్ అధ్యక్షుడు టి నూకరాజు

మొదటి పేజీ తరువాయి..

జగనన్న విద్యా దీవెన పంపిణీ

స్థాయిలో కలెక్టర్ ఆధ్వర్యాన నిర్వహించారు. విశాఖ జిల్లాలో రూ. 36,92,71,992 మొత్తాన్ని మెగా చెక్కు రూపంలో జిల్లా కలెక్టర్ మల్లికార్జున ప్రజా ప్రతినిధులతో కలిసి లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఈ త్రైమాసికానికి సుమారు 41,075 మంది విద్యార్థులకు విద్యా దీవెన కింద లబ్ది చేకూరిందన్నారు. విద్యా దీవెనకు సంబంధించి ఏమైనా సమస్యలుంటే విద్యార్థులు సచివాలయంలో ఉండే వెల్ఫేర్ అసిస్టెంట్లకు తెలియజేస్తే పరిష్కరిస్తారన్నారు. జిల్లాలో 207 మంది ఎస్‌సి విద్యార్థులకు రూ.30.35 లక్షలు, 180 మంది ఎస్‌టి విద్యార్థులకు రూ.14.60 లక్షలు, 33,157 మంది బిసి విద్యార్థులకు రూ.29.01 కోట్లు, 4,640 మంది ఇబిసి విద్యార్థులకు రూ.4.73 కోట్లు, 1,418 మంది కాపు విద్యార్థులకు రూ.1.38 కోట్లు, 221 మంది క్రిస్టియన్ మైనారిటీ విద్యార్థులకు రూ.25 లక్షలు, 1,252 మంది ముస్లిం మైనారిటీ విద్యార్థులకు రూ.1.09 కోట్లు, జమచేసినట్లు తెలిపారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ కొండా రమాదేవి, సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ రమణమూర్తి, బిసి వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీదేవి, గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా ఇన్‌ఛార్జి పూర్ణిమా దేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

అనకాపల్లి జిల్లాలో 37,348 మంది విద్యార్థులకు..

అనకాపల్లి : జగనన్న విద్యా దీవెన రెండో త్రైమాసిక నిధులు జమ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి పాల్గొన్నారు. విద్యా దీవెన చెక్కును లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 37,348 మంది విద్యార్థులకు రూ.28,52,09,123 విద్యార్థుల తల్లుల ఖాతాలకు నేరుగా ముఖ్యమంత్రి జమ చేసినట్లు చెప్పారు. 36,435 మంది బీసీ విద్యార్థులకు 27.86 కోట్లు, 119 మంది ఎస్సీ విద్యార్థులకు రూ.15.55 లక్షలు, 543 ఎస్‌టి విద్యార్థులకు రూ.29.92 లక్షలు, 45 మంది క్రిస్టియన్ మైనార్టీలకు రూ 3.94 లక్షలు, 206 ముస్లిం మైనారిటీ విద్యార్థులకు రూ.16.45 లక్షలు లబ్ది చేకూరుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి అజయ్ బాబు, జిల్లా బీసీ సంక్షేమ అధికారి రాజేశ్వరి, ఏటి డబ్బ్యూ ఓ నాగ శిరీష విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బొడ్డవరలో తనిఖీలు నిర్వహిస్తున్న డిఆర్ఎం అనూప్‌సత్పతి

విశాఖపట్నం - అరకు సెక్షన్ తనిఖీ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విశాఖపట్నం-అరకు సెక్షన్‌ను డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్ సత్పతి బుధవారం తనిఖీ చేశారు. సెక్షన్‌లో జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని, స్టేషన్లలో సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం అరకు స్టేషన్‌లోని విశ్రాంతి భవనం, వెయిటింగ్ హాళ్లు, వసతి గృహాలు, ఇతర రైల్వే కార్యాలయాలనూ పరిశీలించారు. బొడ్డవర రైల్వే స్టేషన్‌లో డబ్లింగ్ పనులు, స్టేషన్‌లో భద్రతకు సంబంధించిన ఆధునీకరణ పనులను పరిశీలించారు. ఈ తనిఖీల్లో ఆయన వెంట చీఫ్ ఇంజనీర్, కెడి రావు, ఎడిఆర్ఎం సుధీర్ కుమార్ గుప్తా, సీనియర్ డివిజనల్ ఇంజనీర్ ఎకె మోహరానా, సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ జి. సునీల్ కుమార్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎకె.త్రిపాఠి, సీనియర్ డివిజనల్ సిగ్నల్, టెలికాం ఇంజనీర్ దీప్తాన్షు శర్మ, సీనియర్ డివిజనల్ ఇంజనీర్ (సెంట్రల్) ప్రభాత్ సింగ్ తదితరులున్నారు.

సహారా ఇండియా ఖాతాదారులు, ఉద్యోగులను ఆదుకోవాలని వినతి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : సహారా ఇండియా ఉద్యోగులు, ఖాతాదారులను ఆదుకోవాలని కోరుతూ విశాఖ ఎంపీ ఎంవివి సత్యనారాయణకు ఆయన కార్యాలయంలో సహారా ఇండియా బాధితుల తరపున సంస్థ చీఫ్ ఫీల్డ్ మేనేజర్ కడిమి హనుమంతరావు తదితరులు వినతిపత్రం అందించారు. సుమారు పదేళ్ల క్రితం ఖాతాదారుల నుంచి ఎటువంటి ఫిర్యాదు లేకపోయినా సెబికి ఖాతాదారుల వివరాలను పంపించినప్పటికీ వాటిని పరిశీలించకుండా సంస్థ ఆస్తులను సీజ్ చేయడం వల్ల మొత్తం సొమ్ము వడ్డీతో సహా సుమారు రూ.25 వేల కోట్లు నిలిచిపోయాయని, దీనివల్ల 10 కోట్ల మంది ఖాతాదారులు, 12 లక్షల మంది ఉద్యోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని వివరించారు. కేంద్ర కో-ఆపరేటివ్ మినిస్టర్ అమిత్ షా దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాల్సిందిగా కోరారు.

ఎడిసి చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ, మంగళపాలెం, జెఎన్ఎన్‌యుఆర్ఎం, టిడ్కో గృ నివాసితులు అగనంపూడి రావడానికి సౌలభ్యంగా తలారువానిపాలెం రైల్వే బ్రిడ్జి అండర్ గ్రౌండ్ దారిని విస్తరించాలని, హోమీ బాబా కేన్సర్ ఆసుపత్రిలో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు కల్పించాలని, అగనంపూడి టోల్ ప్లాజా తొలగించాలని, ఏపీ రిఫైక్ట్రీ నిర్వాసిత రైతులకు న్యాయం చేయాలని, అగనంపూడి జూనియర్ కళాశాలకు సోలార్ పవర్ కల్పించాలని కోరారు. ఈ సమస్యపై ఎంపీ సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాలాపు అచ్చిబాబు, తోకాడ రాము, మకరపు వెంకటరావు పాల్గొన్నారు.

అత్యవసర పనులకు ప్రాధాన్యత : జివిఎంసి కమిషనర్

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ : నగరంలో అత్యవసర పనులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్‌వర్మ పేర్కొన్నారు. బుధవారం ఆయన జోన్లు 5, 3లోని కైలాసపురం, సాలిగ్రామపురం, డివిఎల్‌బి క్వార్టర్స్, అయ్యప్పనగర్, శ్రీనివాసనగర్, ఎవిఎస్ఆర్ నగర్, మురళీనగర్, మాధవధారతో పాటు శివాజీ పార్కు, బీచ్ రోడ్‌లోని స్విమ్మింగ్‌పూల్ తదితర ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రధాన రహదారులతో పాటు వీధి రోడ్లలో పారిశుధ్య పనులు పక్కాగా జరగాలన్నారు. చాలా వ్యర్థాలు కనిపిస్తున్నాయని, ఆయా సచివాలయాల పరిధిలోని శానిటరీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించి చెత్త కుప్పలను ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు.

తదుపరి శివాజీ పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ సభ్యులు మరుగుదొడ్లు, నడక మార్గం, తాగునీరు, విద్యుత్తు సమస్యలు పార్కులో ఉన్నాయని, వాటిని పునరుద్ధరించాలని కమిషనర్‌ను కోరారు. కమిషనర్ స్పందిస్తూ అత్యవసర పనులు తక్షణమే చేపట్టేందుకు టెండర్లను పిలవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

అనంతరం బీచ్ రోడ్డులో ఉన్న స్విమ్మింగ్ పూల్‌ను సందర్శించి పనులను పరిశీలించారు. దాదాపు 70 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులు త్వరగా చేపట్టి ప్రజలకు స్విమ్మింగ్ పూలుని అందుబాటులోకి తీసుకురావాలని, స్విమ్మింగ్‌కు సంబంధించిన సామగ్రి అంతా సమకూర్చుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, డిడిహెచ్ దామోదరరావు, పర్యవేక్షక ఇంజినీర్ వినయ్‌కుమార్, కార్యనిర్వాహక ఇంజినీర్ సుధాకర్, అసిస్టెంట్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

ప్రపంచ మార్పులపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ప్రపంచంలో జరుగుతున్న మార్పులపై దృష్టి సారించాలని బాష్ గ్లోబల్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్ సిఇఒ దత్తాత్రి సలగమే సూచించారు. ఐఐఎం విశాఖపట్నంలో నూతన బ్యాచ్‌కు దత్తాత్రి సలగమే ఆహ్వాన సందేశం ఇచ్చారు. ఎంబిఎ 2023-25 బ్యాచ్ విద్యార్థుల కోసం బుధవారం నిర్వహించిన ఇమ్మర్షన్ మాడ్యూల్‌లో "మారుతున్న కాలాల్లో అగ్రగామి" అనే అంశంపై దత్తాత్రి సలగమే ప్రసంగించారు. భౌగోళిక-రాజకీయ, సాంకేతికత, వినియోగదారులు, సమాజాలు, శ్రామికశక్తి, సుస్థిరతపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. నాయకత్వం వహించడానికి అవసరమైన సామర్థ్యాలు, నాయకత్వ విధానం గురించి విద్యార్థులకు వివరించారు. ఆటోమోటివ్ పరిశ్రమ విషయంలో సమయానుకూలంగా నిర్ణయం తీసుకోవడం, భాగస్వామ్య విలువ సృష్టి అవసరమన్నారు.

ఐఐఎం విశాఖపట్నం డైరెక్టర్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ, తమ సంస్థ నిబద్ధతతో పనిచేస్తుందని, అధిక నాణ్యత, నిర్వహణ విద్యను అందించడానికి, కార్పొరేట్ నాయకులు వ్యాపారం కోసం వినూత్న పరిష్కారాలను రూపొందించడంలో సహాయపడటానికి ప్రోగ్రామ్‌లను రూపొందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వం, కార్పొరేట్ సంబంధాల హెడ్ వీరారెడ్డి ద్వారంపూడి, మొబిలిటీ సొల్యూషన్స్ ఎండి మనోజ్ ఎక్కుండి, ప్రోగ్రాం చైర్‌పర్సన్ ప్రొఫెసర్ హ్యాపీ పాల్, ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ ప్రీతి విర్ది పాల్గొన్నారు .

ఐఐఎం విద్యార్థులకు సందేశం ఇస్తున్న దత్తాత్రి సలగమే తదితరులు

నేడు వాహనాల వేలం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : గతంలో వివిధ కేసులలో పట్టుబడిన ఐదు ద్విచక్ర వాహనాలను మహారాణిపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో డిప్యూటీ కమిషనర్ ఆధ్వర్యాన గురువారం ఉదయం 11 గంటలకు వేలంపాట నిర్వహించనున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలవారు ఎంవిపి సెక్టార్-1లోని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కార్యాలయంలో జరిగే వేలంపాటలో పాల్గొనాలని సూచించారు.

చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : తూర్పు నియోజకవర్గం మద్దిలపాలెం బిజెపి మండల అధ్యక్షులు పోతల సత్యనారాయణ ఆధ్వర్యాన మజ్జిగ సరఫరా కేంద్రాన్ని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు రవీంద్ర మేడపాటి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాజా మురళీమోహన్ రాజు, కనకాల పాపారావు, వెంకటలక్ష్మి, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ కోచింగ్ క్యాంపునకు విశేష ఆదరణ

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : జివిఎంసి నిర్వహిస్తున్న సమ్మర్ కోచింగ్ క్యాంపునకు విద్యార్థుల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని కమిషనర్ సిఎం.సాయికాంత్‌వర్మ తెలిపారు. జివిఎంసి అన్ని జోన్ల పరిధిలో నిర్వహిస్తున్న సమ్మర్ కోచింగ్ క్యాంపులలో అధిక శాతం విద్యార్థులు పాల్గొంటున్నారని పేర్కొన్నారు. జోనల్ కమిషనర్ల పర్యవేక్షణలో పిల్లలకు కోచ్‌లు తర్ఫీదు ఇస్తున్నారని, మొత్తం 333 సెంటర్లో 33 రకాల ఈవెంట్స్ జరుగుతున్నాయని, 15 రోజుల పాటు జరిగే ఈ సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లో ఆటలలో పాల్గొన్న పిల్లలకు బ్రేక్ ఫాస్ట్ అందించడం జరుగుతుందని తెలిపారు. పిల్లల తల్లిదండ్రులు దగ్గరలో నిర్వహించే సమ్మర్ కోచింగ్ క్యాంపులకు తీసుకొని వెళ్లి ఆటలలో పాల్గొనే విధంగా ప్రోత్సహించాలని కోరారు.

28న ఘంటసాల జీవిత చరిత్ర నాటకం

వివరాలు వెల్లడిస్తున్న బాదంగీర్ సాయి తదితరులు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : భారతదేశ నాటక రంగ చరిత్రలో మొట్టమొదటి నాటక గ్రంథాలయానికి శాశ్వత నిధుల కోసం రంగసాయి నాటక సంఘం ఆధ్వర్యాన ఈ నెల 28వ తేదీన ఘంటసాల జీవిత చరిత్ర నాటకాన్ని ప్రదర్శిస్తున్నట్లు రంగసాయి నాటక సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు బాదంగీర్ సాయి తెలిపారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, భాస్కరుని సత్యజగదీష్ దర్శకత్వంలో కళాభారతి ఆడిటోరియంలో ప్రదర్శిస్తున్నట్లు చెప్పారు. సాయంత్రం 5 గంటలకు ఒక ప్రదర్శన, రాత్రి 7:30 గంటలకు మరొక ప్రదర్శన ఉంటాయన్నారు. శ్రీసాయి సంతోషి నాట్య మండలి సురభి కళాకారులు 138 సంవత్సరాల చరిత్రలో తొలిసారి ఘంటసాల జీవిత చరిత్ర సాంఘిక నాటకాన్ని ప్రదర్శిస్తున్నారని తెలిపారు. రూ.300, రూ.200, రూ.100 డోనర్ పాసులు రంగ సాయి నాటక గ్రంథాలయంలోనూ, కళాభారతిలోనూ లభిస్తాయన్నారు. విశాఖ ప్రజలు ఈ నాటకాన్ని వీక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ ఎన్.నాగేశ్వరరావు, బిఎస్.చంద్రశేఖర్, సినీ నటులు కుమార్‌రాజా, కో-ఆర్డినేటర్ చినబాబు పాల్గొన్నారు.

ఫిషింగ్ హార్బర్‌ను జెసి పరిశీలన

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : మత్స్యకారుల సంఘాలతో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు బుధవారం జాయింట్ కలెక్టర్ కెఎస్ విశ్వనాథన్‌తో కూడిన అధికారుల బృందం ఫిషింగ్ హార్బర్‌ను పరిశీలించారు. రూ.152 కోట్లతో ఫిషింగ్ హార్బర్‌ను అభివృద్ధి చేయడం కోసం రూపొందించిన డిపిఆర్‌ను ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన మత్స్యకార సంఘాల నాయకులకు వివరించారు. తాము మొదటి నుంచి కోరుతున్న విధంగా హార్బర్‌లో ఉన్న ఆక్షన్ హాలు ప్రదేశంలోనే కొత్త ఆక్షన్ హాలు అభివృద్ధి చేసి నిర్మించాలని, మరొక చోట ఆక్షన్ హాల్ నిర్మిస్తే అంగీకరించేది లేదని మత్స్యకార సంఘాల నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్‌తో పాటు జెడి ఫిషరీస్, విశాఖ పోర్ట్, జివిఎంసి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఫిషింగ్ హార్బర్‌ను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్, ఇతర అధికారులు

పారాచూట్ అడ్వాన్స్‌డ్ టీవీసీ విడుదల

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : మారికో లిమిటెడ్ ప్రీమియం హెయిర్ నరిష్‌మెంట్ బ్రాండ్ పారాచూట్ అడ్వాన్స్‌డ్ ఆనియన్ హెయిర్ ఆయిల్ టీవీసీని విడుదల చేసినట్లు మారికో లిమిటెడ్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ సోమశ్రీ బోస్ తెలిపారు. నగరంలోని హోటల్లో మీడియాతో ఆయన మాట్లాడుతూ, పారాచూట్ అడ్వాన్స్‌డ్ ఆనియన్ హెయిర్ ఆయిల్ అనేది ఉల్లిపాయ శక్తిని, కొబ్బరి సద్గుణాలతో మిళితం చేస్తుందన్నారు. జుట్టు పెరుగుదలను పెంచడానికి, జుట్టు రాలటాన్ని తగ్గించటానికి శక్తివంతంగా పనిచేస్తుందన్నారు. తమ సంస్థ తాజా ఆఫర్ తమ వినియోగదారుల నమ్మకాన్ని పొందుతుందనే ఆశాభావం వెలిబుచ్చారు.

సోలార్ విద్యుత్ సౌకర్యం కల్పన

ఉచిత సోలార్ విద్యుత్ కనెక్షన్లు అమర్చుతున్న సంస్థ సభ్యులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఇప్పటికీ విద్యుత్ సదుపాయానికి నోచుకోని భీమిలి అర్బన్, ఆనందపురం మండల పరిధిలోని పలు గ్రామాలు, ప్రాంతాల్లో ఉన్న 29 కుటుంబాలకు ఆప్టిమన్ పరిశ్రమ సిఎస్ఆర్ నిధులతో హ్యాబిట్ ఫర్ హ్యుమనిటీ ఇండియా, ఎస్‌విడిఎస్, అసోసియేషన్ ఆఫ్ పీపుల్ పవర్ సంస్థలు కొనుగోలు చేసిన సోలార్ పవర్ ప్యానెల్, బ్యాటరీ, బల్బు, ఫ్యాన్, కన్వర్టర్, స్టాండ్ ఇతర సామగ్రిని బుధవారం ఉచితంగా అందజేశారు. భీమిలి, ఎగువ పేట, కృష్ణా కాలనీ, మామిడిపాలెం, ఆనందపురం మండలం లొడగలవానిపాలెం తది తర గ్రామాల్లో విద్యుత్ సదుపాయానికి నోచుకోని కుటుంబాలకు

ఈ సోలార్ ప్యానెల్, ఇతర సామగ్రి అమర్చి విద్యుత్ సదుపాయం కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌విడిఎస్ సంస్థ ప్రతినిధి చైతన్య, పీపుల్ పవర్ సంస్థ సభ్యులు నిమ్మకాయల భాస్కర్, జీవన్ కార్తీక్, సునీల్ రెడ్డి, హర్ష సురేష్ సర్దార్, శ్యామ్ రెడ్డి, అక్షర, హర్షిత పాల్గొన్నారు

భూసమస్యకు పరిష్కారానికి సమిష్టి పోరాటం

ప్రజాశక్తి -భీమునిపట్నం : రైతులంతా సమిష్టిగా పోరాడితే భూసమస్యకు పరిష్కారం లభిస్తుందని రాజ్యసభ సభ్యులు జివిఎల్ నరసింహారావు అన్నారు. తమ సాగులో ఉన్న ఇనాంభూములపై శాశ్వత భూయాజమాన్య హక్కు కల్పించాలని, ఎస్ఎఫ్ఎలో పేర్లు తారుమారు చేసి అక్రమాలకు పాల్పడుతున్న జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పెదబాబు, అతనికి సహకరించిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆందోళన చేస్తున్న నారాయణరాజు పేట రైతుల ఆందోళనకు సంఘీభావం ప్రకటించారు. బుధవారం రైతుల సాగులో ఉన్న భూములను నేరుగా పరిశీలించారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. స్థానిక నేతలు పాల్గొన్నారు.

టిడిపి మహానాడును జయప్రదం చేయండి

ప్రజాశక్తి -భీమునిపట్నం : రాజమహేంద్రవరంలో ఈ నెల 27,28 తేదీల్లో జరుగనున్న టిడిపి మహానాడును జయప్రదం చేయాలని పార్టీ నియోజక వర్గ ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు పార్టీ నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో మాట్లాడుతూ ఆహ్వానం ఉన్న వారు మాత్రమే 27న జరుగు ప్రతినిధుల సమావేశానికి హాజరు కావాలని కోరారు. 28న మధ్యాహ్నం 3 గంటలకు జరుగు బహిరంగసభను పార్టీ శ్రేణులెవరైనా హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నియోజక వర్గ పరిశీలకులు కోట్ని బాలాజీ, పార్టీ మండల అధ్యక్షులు డిఎఎన్ రాజు, వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.దామోదరరావు, బిసి సెల్ ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మణరావు, రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, జివిఎంసి 3, 98 వార్డుల కార్పొరేటర్లు గంటా అప్పలకొండ, వరహా నరసింహం, విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ ఉపాధ్యక్షులు బోయి వెంకట రమణ, కార్యదర్శి పిట్టా సురేష్, ఎస్సి సెల్ నియోజకవర్గ అధ్యక్షులు పతివాడ రాంబాబు, మాజీ జెడ్‌పిటిసి సభ్యులు ఎస్ అప్పారావు,1, 2, 4, 5 98 వార్డుల అధ్యక్షులు పాల్గొన్నారు

సమావేశంలో మాట్లాడుతున్న కోరాడ రాజబాబు

కళాకారులకు చేదోడు వాదోడుగా ఉంటా!

విశాఖ'మా' అధ్యక్షుడు దాడి సత్యనారాయణ

మాట్లాడుతున్న సత్యనారాయణ

ప్రజాశక్తి -ములగాడ : కళాకారుల అభివృద్ధి, వారి సంక్షేమానికి చేదోడువాదోడుగా ఉంటానని విశాఖ 'మా' నూతన అధ్యక్షులు, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ అన్నారు, బుధవారం సింధూర గెస్ట్ హౌస్‌లో ఆంధ్రప్రదేశ్ మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్(మా) సర్వసభ్య సమావేశం నిర్వహించారు.పాత కమిటీ గడువు ముగియడంతో నూతన కమిటీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో మ అధ్యక్షునిగా దాడి సత్యనారాయణ, మిగతా పాలకవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ, విశాఖ పరిసర ప్రాంతాల్లో ఏ షూటింగ్ జరిగినా స్థానిక కళాకారులకు అవకాశం కల్పించేందుకు సహకరిస్తానన్నారు. చాలామంది కళాకారులు దిగువ స్థాయిలో ఉన్నారని, వారిని ఆదుకునే బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కళాకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానన్నారు.సంఘంలో వివిధ విభాగాలను అభివృద్ధి చేసి, 'మా'ను ఆర్థికంగా పరిపుష్టి చేసేందుకు కృషి చేస్తానని వెల్లడించారు. అనంతరం ఎపి 'మా' ఆధ్వర్యంలో కళాకారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వనున్నట్లు వెల్లడించారు. అనంతరం సంఘానికి తనవంతుగా రూ. 25వేలు ఆర్థికసాయం అందించగా, మరికొంత మంది కళాకారులు ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో వర్రె నాంచారయ్య, ఎ.ఎం.ప్రసాద్, తేజ, వెంకట్‌రెడ్డి, కిషోర్, వెంకట్, శివజ్యోతి, పండా పాల్గొన్నారు.

వాలంటీర్లకు సేవా అవార్డుల ప్రదానం

సేవా అవార్డులతో వాలంటీర్లను సత్కరిస్తున్న కెకె.రాజు, తదితరులు

ప్రజాశక్తి- సీతమ్మధార : ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా విశేషసేవలు అందిస్తున్న వాలంటీర్లు అభినందనీయులని ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, నెడ్‌క్యాప్ రాష్ట్ర చైర్మన్ కెకె.రాజు అన్నారు. బుధవారం 46వ వార్డు శాంతినగర్ కమ్యూనిటీ హాల్‌లో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ ఆధ్వర్యంలో ఆ వార్డుకు సంబంధించిన వాలంటీర్లకు సేవామిత్ర, సేవారత్న, సేవా వజ్ర అవార్డులను ప్రదానం చేశారు. ఎంపికైన వాలంటీర్లకు దుశ్శాలువాతో సత్కరించి, మెమొంటో, సర్టిపికెట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, అర్హులైన వారందరికీ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ లబ్ధిని వారి చెంతకే అందించిన వాలంటీరు వ్యవస్థ అందరికీ ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో జివిఎంసి కోఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిరణ్ రాజు, ఐదో జోన్ ఎపిడి శైలజ, బి.గోవింద్, కె.చిన్నా, నరసింగరావు, కె.రామారావు, ఎస్.రామారావు, జి.అప్పారావు, అప్పలరెడ్డి, తారకేష్, వరలక్ష్మి, వి.శ్రీను, శ్రీనురెడ్డి, కృప, సచివాలయ కన్వీనర్లు సిబ్బంది, ఆర్‌పిలు పాల్గొన్నారు.

43,44 వార్డుల పరిధిలో..

జివిఎంసి 43,44 వార్డుల పరిధిలోని వాలంటీర్లకు సేవా అవార్డులను షాదీఖానా కల్యాణమండపంలో ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు అందజేశారు. జివిఎంసి ఐదో జోన్ యంత్రాంగం ఆధ్వర్యంలో సేవామిత్ర, సేవా రత్న, సేవా వజ్ర అవార్డులకు ఎంపికైన వాలంటీర్లను సత్కరించి, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో జివిఎంసి ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, 43వ వార్డు కార్పొరేటర్ పి.ఉషశ్రీ, ఎపిడి శైలజ పాల్గొన్నారు.

పరవాడ : పరవాడ మరిడి మాంబ ఫంక్షన్ హాల్‌లో మూడో ఏడాది ఉత్తమ వాలంటీర్ల సేవా మిత్ర, సేవారత్న, సేవా వజ్ర పురస్కారాలను ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఉత్తమ వాలంటీర్లను సన్మానించి ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. ఎంపిపి పైల వెంకట పద్మలక్ష్మి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, పరవాడ సర్పంచ్ సిరిపురపు అప్పల నాయుడు, వైస్ ఎంపీపీలు బంధం నాగేశ్వరరావు, బూస అప్పలరాజు, వైసిపి నాయకులు చుక్క రాము నాయుడు, కోన రామారావు, వెన్నెల సన్యాసిరావు పాల్గొన్నారు.

రావికమతం : ప్రజలకు సేవ చేసి వారి మన్ననలు పొందే అదృష్టం అందరికీ ఉండదని, అది ఒక్క వాలంటీర్స్‌కు మాత్రమే జగన్మోహన్ రెడ్డి అవకాశం కల్పించారని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విప్, చోడవరం శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ అన్నారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో ధర్మశ్రీ పాల్గొని అత్యుత్తమ సేవలు అందించిన వాలంటీర్లకు అవార్డులు అందజేశారు. సేవా రత్నా పథకానికి ఎంపికైన వాలంటీర్స్ కు రూ. 20వేల నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రం, మెడల్ ఇచ్చి సన్మానించారు. సేవా మిత్ర లకు ఎంపికైన వాలంటీర్స్‌కు పదివేల చొప్పున నగదు బహుమతి అందించి సత్కరించారు. ఈ సందర్భంగా ధర్మ శ్రీ మాట్లాడుతూ వాలంటీర్స్ బాధ్యతాయుతంగా ప్రభుత్వం అందిస్తున్న ప్రతి సంక్షేమ పథకానికి అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వారికి అందే విధంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పైలా రాజు, మండల పార్టీ అధ్యక్షులు ముక్క మహాలక్ష్మి నాయుడు, మండల కన్వీనర్ జగ్గారావు, వైస్ ఎంపీపీ రమణ, ఎంపీడీవో వెంకన్నబాబు, కవగుంట సర్పంచ్ దాసరి వరహాలు, పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

పరవాడలో అవార్డులు అందుకున్న వాలంటీర్లు

నేరాలు ఘోరాలు

21 మంది జూదరుల అరెస్ట్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్ పరిధి శాంతినగర్ దుర్గమ్మ గుడి వెనుక జూదం ఆడుతున్నారనే సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ ఎసిపి త్రినాధరావు, సిబ్బంది దాడిచేశారు. 21 మందిని అరెస్టుచేశారు. వారి నుంచి రూ.1,01,190నగదు, ఒక ఆటో, ఆరు ద్విచక్ర వాహనాలు, 22 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను తదుపరి చర్య నిమిత్తం ఎయిర్‌పోర్టు పోలీసులకు అప్పగించారు.

వేసవి క్రీడా శిక్షణ ప్రారంభం

భీమిలిలో క్రీడాకారులతో కార్పొరేటర్ అప్పల కొండ

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక జివిఎంసి, పిఎన్ఎం ఉన్నత పాఠశాలలో బుధవారం వేసవి క్రీడా శిబిరాన్ని మూడో వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని విద్యార్థులకు సూచించారు. కిక్ బాక్సింగ్, హ్యాండ్‌బాల్ శిక్షణను లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్ఎం తిరుమల శ్రీదేవి, మాజీ కౌన్సిలర్ గంటా నూకరాజు, కోచ్‌లు రాజారావు, లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కంచరపాలెం: జివిఎంసి వేసవి క్రీడాశిక్షణ శిబిరాల్లో భాగంగా 56వ వార్డు, కంచరపాలెం ఆర్‌పి పేట ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆల్ ఇండియా ఎంసెంట్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ, టైగర్ కిక్ బాక్సింగ్ కౌన్సిల్ అసోసియేషన్ సభ్యులు, మాస్టర్ గుండి జానకిరాము ఆధ్వర్యంలో కిక్ బాక్సింగ్ శిక్షణను నిర్వహిస్తున్నారు. శిక్షణార్థులకు జివిఎంసి పంపిణీ చేసిన డైట్‌ను వెల్ఫేర్ సెక్రెటరీ సన్యాసినాయుడు పర్యవేక్షణలో అందజేశారు. కార్యక్రమంలో స్పెషలాఫీసర్ పిడబ్ల్యూ ఎఇ ఉషారాణి, శానిటేషన్ సెక్రటరీ నళిని, ఎమినిటీస్ సెక్రటరీ వినీత, ఎఎన్ఎం మణి, ఆశా వర్కర్స్ పాల్గొన్నారు.

డైట్‌ను అందజేస్తున్న జివిఎంసి ప్రతినిధులు

రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని పాండ్రింగి పంచాయతీ సామయవలస గ్రామంలో శ్రీసీతాలక్ష్మణ హనుమత్ సమేత శ్రీరామచంద్రస్వామి అలయ నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. విజయనగరం జిల్లా నెలిమర్ల శ్రీదుర్గా మహ పీఠాధిపతి, ఎస్‌సిఎస్ గ్రూప్స్ వైస్‌చైర్మన్, హిందూ క్రమశిక్షణా కమిటీ ఇన్‌ఛార్జి శ్రవణ చైతన్యానంద చిన్నస్వామి పర్యవేక్షణలో ప్రత్యేకపూజ కార్యక్రమాలు నిర్వహించారు.

పార్టీ బలోపేతానికి కృషి

ప్రజాశక్తి- ఆనందపురం : జనసైనికులు రెట్టింపు ఉత్సాహంతో పార్టీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ పంచకర్ల సందీప్ అన్నారు. బుధవారం ఆనందపురంలో నూతనంగా స్థాపించిన పార్టీ నూతన కార్యాలయంలో పార్టీ కేడర్‌తో ఆత్మీయసమావేశం నిర్వహించారు. వచ్చేనెలలోకమిటీల ఏర్పాటు ప్రక్రియ జరుగుతుందని, పార్టీకోసం కష్టించిన వారికి తప్పక ప్రాధాన్యత ఉంటుందని వెల్లడించారు. కార్యక్రమంలో శాఖరి శ్రీనుబాబు, కృష్ణయ్య, మజ్జి శ్రీను, తాడివాడ శివకృష్ణ, ప్రశాంత్‌కుమార్, బొద్దపు గోవిందు, మూర్తి, బాలు, నాని, రాజు, మీసాల నాగేశ్వరరావు, అభి, బంగారునాయుడు పాల్గొన్నారు.

అక్రమ కేసులపై ఆటో కార్మికుల నిరసన

సిఐటియు ఆధ్వర్యాన ఆందోళన చేస్తున్న ఆటో కార్మికులు

ప్రజాశక్తి- సీతమ్మధార : విశాఖనగరంలో ఆటో కార్మికులపై రవాణాశాఖ అధికారుల దాడులను నియంత్రించి, అక్రమ కేసులు బనాయించడాన్ని తక్షణమే ఆపాలని విశాఖ ఆటోరిక్షా కార్మిక సంఘం (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సత్యన్నారాయణ డిమాండ్ చేసారు. బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో సీతమ్మధార అల్లూరి విగ్రహం వద్ద ఆటో కార్మికులతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సత్యన్నారాయణ మాట్లాడుతూ ఆటో కార్మికులకు వాహనమిత్ర సాయమంటూ రూ.పది వేలు ఇచ్చిన ప్రభుత్వం ఆర్‌టిఒ అధికారులతో దాడులు చేయించి, అక్రమ కేసులను బనాయించడం ద్వారా అంతకు అనేకరెట్లు మొత్తాన్ని జరిమానా రూపంలో పిండేయడం దుర్మార్గమన్నారు. కార్మికుల సంక్షేమమంటూనే వారిని కుదేలు పరిచే చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు వెల్లడించారు. కోవిడ్ విజృంభణ తర్వాత ప్రతి ఇంటిలోనూ సొంత వాహనం సమకూరడం, మరోవైపు డీజిల్, పెట్రోల్ ధరలు ఇబ్బడిముబ్బడిగా పెంచడంతో ఆటోకార్మికుల ఆదాయం పూర్తిగా పడిపోయిందని, రోజుకు రూ.300 ఆదాయం కూడా మిగలని పరిస్థితి ఉంటున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఆర్‌టిఒ, పోలీసుల దాడులు, కేసులు, జరిమానాలతో ఆటోకార్మికులను మానసిక వేదనకు గురిచేస్తూ, వారిని ఆత్మహత్యలకు పురిగొలిపే పరిస్థితులు కల్పించడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, ఆటోకార్మికులపై రవాణాశాఖ, పోలీసుల దాడులు, ఇతర వేధింపులకు చెక్ పెట్టాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి జి.అప్పలరాజు, ఆటో యూనియన్ గౌరవాధ్యక్షులు వి.కృష్ణారావు, నాయకులు కాటరాజు, నాయుడు, శ్రీను, సురేష్, గురునాధరెడ్డి పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన సిపి

కంచరపాలెం పోలీస్‌స్టేషన్ సందర్శనలో సిపి, ఇతర అధికారులు

ప్రజాశక్తి - కంచరపాలెం: నగర పోలీస్‌కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా కంచరపాలెం పోలీస్‌స్టేషన్‌ను సిపి త్రివిక్రమ్‌వర్మ బుధవారం ఉదయం సందర్శించారు. స్టేషన్‌లో వివిధ కేసులకు సంబంధించిన ఫైళ్లను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలపై ఆరాతీసి, వాటిని పరిష్కారానికి దృష్టి సారించాలని ఆదేశించారు. వివిధ కేసుల్లో అరెస్టు కాకుండా తప్పించుకు తిరుగుతున్న నిందితులపై ప్రత్యేక నిఘా పెట్టి అదుపులోకి తీసుకోవాలని సూచించారు. పోలీస్‌స్టేషన్‌కు న్యాయం కోసం వచ్చే వారి పట్ల ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, పిల్లల ఫిర్యాదులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు.. పోలీస్‌స్టేషన్ పనితీరును పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. డిసిపి ఆనందరెడ్డి, ఎసిపి అన్నెపు నరసింహమూర్తి, సిఐ ఎస్ విజయ్‌కుమార్, ఎస్ఐలు సమీర్, రవికిషోర్, క్రైమ్ ఎస్ఐ సునీల్, ఎఎస్ఐలు సతీష్, పాపారావు, సిబ్బంది ఉన్నారు.

సిలంబం జాతీయస్థాయి పోటీల్లో
పతకాలు సాధించిన విద్యార్థులకు అభినందన

పతకాలు సాధించిన విద్యార్థులు వీరే

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఈ నెల 21న తమిళనాడులోని కోయంబత్తూరులో జరిగిన 4వ జాతీయస్థాయి సిలంబం ఛాంపియన్ షిప్ పోటీల్లో మండలంలోని అన్నవరం గ్రామానికి చెందిన నలుగురు విద్యార్థులు బంగారు, కాంస్య పతకాలను సాధించారు. 11 కిలోల విభాగంలో 7వ తరగతి విద్యార్థి కె కుష్వంత్‌కుమార్ బంగారు పతకాన్ని సాధించగా, 13 కిలోల విభాగంలో 8వ తరగతి విద్యార్థిని కె సుప్రియ కాంస్య పతాకాన్ని, 9 కిలోల విభాగంలో 4వ తరగతి విద్యార్థి ఎస్ వినయ్‌ఈశ్వర్ రెండు కాంస్య పతకాలను, 14 కిలోల విభాగంలో 9వ తరగతి విద్యార్థి ఎ లక్ష్మీనారాయణ కాంస్య పతకాలను సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన కోచ్ శ్రీనివాసరావును బుధవారం గ్రామంలో వెటరన్ క్రీడాకారుడు అల్లిపల్లి ఎల్లాజీ అభినందించారు.

బాలికలకు ఐరన్ మాత్రల పంపిణీ

బాలికలకు ఐరన్ మాత్రలు పంపిణీ చేస్తున్న ఎఎన్ఎం సునీత

ప్రజాశక్తి -తగరపువలస :రక్తహీనతతో బాధపడుతున్న 21 మంది బాలికలకు బుధవారం ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలను పంపిణీ చేశారు. జివిఎంసి ఒకటో వార్డు చిట్టివలస డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గతంలో జరిపిన ఆరోగ్య తనిఖీలలో 21మంది రక్తహీనతతో బాధపడుతున్నట్లు గుర్తించారు. ఆయా బాలికలను బుధవారం పాఠశాలలో జరిగినకార్యక్రమంలో హెచ్ఎం ఎం.పద్మావతి పర్యవేక్షణలో ఎఎన్ఎం, సునీత, ఆశా కార్యకర్తలు మాత్రలు అందజేశారు.

46వ వార్డులో గడపగడపకూ...


ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న కెకె.రాజు

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 46వ వార్డు సంజీవయ్య కాలనీ-1, సంతోష్‌నగర్ ప్రాంతాలలో విశాఖ ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, నెడ్‌క్యాప్ రాష్ట్ర ఛైర్మన్ కెకె.రాజు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ ఆధ్వర్యంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించడంతోపాటు, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కెకె రాజు మాట్లాడుతూ, పాదయాత్రలో పేదల కష్టాలను తెలుసుకున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, మ్యానిఫెస్టోలో వాటిని పెట్టి, ప్రజలకు లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా అనేక పథకాలను అమలు చేస్తున్నారన్నారు. విద్య, వైద్యం, ఉపాధి ప్రతిఒక్కరికీ అందేలా పాలన సాగిస్తున్న జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చూడాలని ప్రజలంతా కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, 42వవార్డు కార్పొరేటర్ ఆళ్ల లీలావతి,శ్రీనివాసరావు, వైసిపియువజన విభాగం జిల్లా అధ్యక్షులు ఆళ్ల శివ గణేష్, డైరెక్టర్లు రాయుడు శ్రీను, 46వ వార్డు నేతలు బి.గోవింద్, కె.చిన్నా, దుర్గ భవాని పాల్గొన్నారు.

మధ్యాహ్న వేళల్లోనూ ఓపి సేవలు
ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో అవుట్ పేషెంట్ సేవలు పొడిగింపు

డాక్టర్ విశ్వామిత్ర

ప్రజాశక్తి- సీతమ్మధార : స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో ప్రభుత్వ ఆదేశాల మేరకు అవుట్ పేషెంట్ సేవలను మరింత విస్తృతం చేస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.విశ్వామిత్ర వెల్లడించారు. ఇక నుంచి మధ్యాహ్నం 3 గంటల నుండి 4 గంటల వరకు ఒక గంటపాటు అదనంగా అవుట్ పేషెంట్ సేవలు అందుబాటులో ఉంటాయని, వాటిని రోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉత్తరాంధ్రలో కంటిరోగులకు విశేషసేవలు అందిస్తున్న ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో, ఒడిశాతోపాటు ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల నుంచి అధికసంఖ్యలో రోగులు వస్తుంటారు. ఈనేపథ్యంలో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు ఇబ్బందులు లేకుండా, ఏరోజు వచ్చిన వారికి ఆ రోజే అవసరమైన అవుట్‌పేషెంట్ సేవలు అందించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. వైద్యానికి వచ్చే కంటిరోగులు సేవలు పొందకుండా తిరిగి వెళ్లడం, మళ్లీ వచ్చే పరిస్థితులకు ఆస్కారం లేకుండా అవసరమైన సిబ్బందిని కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్న వేళల్లో అవుట్‌పేషెంట్ సేవలను కూడా ఆయా రోజుల్లో ఉదయం అందుబాటులో ఉండే యూనిట్ల వైద్యులే అందిస్తారని, రోగులు గమనించి సేవలను వినియోగించుకోవాలని కోరారు.

కక్షతోనే నిందారోపణలు

ప్రజాశక్తి-పద్మనాభం : తనపై కక్షతోనే గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు సత్యదూరమైన నిందారోపణలు చేస్తున్నా రని పాండ్రంగి పిఎసిఎస్ అధ్యక్షులు అముజూరి అప్పారావు ప్రకటనలో తెలిపారు. సాగునీటి కాలువలు పూడుకుపోయి, ఎత్తుపల్లాలతో నీరు సాఫీగా సాగే పరిస్థితి లేనందున రైతుల ఆమోదంతోనే పంటకాలువల్లోని మట్టిని చదును చేయిస్తే, తాను మట్టిని తవ్వి అమ్ముకుంటున్నానని వార్డు సభ్యుడు మహంతి అప్పలరమణ అవాస్తవమైన ఆరోపణలతో ఆర్‌డిఒకు ఫిర్యాదు చేశారన్నారు. గతనెలలో గ్రామదేవత జట్లమ్మతల్లి పండుగ నిర్వహణకు అభ్యంతరం తెలిపిన కొంతమందికి తాను మద్దతుగా ఉన్నాననే అక్కసుతోనే ఇలాంటి అసత్యఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ రఘురాం

ప్రజాశక్తి -ఆనందపురం: రోడ్డు భద్రతా నియమాలు కచ్చితంగా పాటిస్తే, అధికశాతం ప్రమాదాలను నివారించవచ్చునని ఆనందపురం ట్రాఫిక్ ఎస్ఐ రఘురాం అన్నారు. బుధవారం పాలవలస గ్రామంలో ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వాహనంతో రోడ్డెక్కితే సురక్షిత ప్రయాణానికి ఎవరికివారే రహదారి భద్రతా నియమాలు పాటించాలన్నారు. బైకిస్టులు విధిగా హెల్మెట్ ధరించాలని, మద్యం మత్తులో వాహనం నడపడం, త్రిపుల్ డ్రైవింగ్, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపడం, స్పీడ్, ర్యాష్ డ్రైవింగ్ చేయకపోవడం ద్వారా అధిక ప్రమాదాలు నివారించవచ్చన్నారు. డ్రైవింగ్ లైసెన్స్‌లేని మైనర్లకు వాహనాలను ఇస్తే ప్రమాదకరమని, దీనికి సంబంధిత వాహన యజమాని బాధ్యుడౌతాడని హెచ్చరించారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే, రోడ్డు ప్రమాదాలు జరిగే అస్కారమే ఉండదన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థో విభాగం సేవలపై వివాదం

అగనంపూడి సిహెచ్‌సి

ప్రజాశక్తి -గాజువాక : అగనంపూడి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఆర్థో విభాగం సేవలపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు. వైద్యానికి వచ్చిన రోగులను ప్రభుత్వపరంగా సరఫరా చేసే మందులు, ఉపకరణాలు ఇవ్వకుండా ఇక్కడి వైద్యులు బయట కొనుగోలు చేయాలని రోగులకు సూచిస్తుండడంతో పలువురు ఆవేదన చెందుతున్నారు. బుధవారం ఆసుపత్రిలో ఇటువంటి ఘటనే చోటుచేసుకుంది. ఆసుపత్రిలో ఆసుపత్రిలో ఆర్థో విభాగానికి వైద్యం కోసం ఒక రోగికి ఇలాగే బయట ఉపకరణాలు కొని తేవాలని డాక్టర్ చెప్పడంతో సంబంధిత రోగి బంధువులు వైద్యునితో వాగ్వాదానికి దిగారు. విషయాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ దృష్టికి కూడా తీసుకెళ్లారు. నిరుపేద రోగులు ఉచిత వైద్యం అందుతుందని ఆసుపత్రికి వస్తే, ఇలా వేలల్లో ఖర్చయ్యే ఉపకరణాలు కొని తెచ్చుకోవాలని ఆర్థో విభాగం వైద్యులు చెప్పడంపై ఆవేదన చెందుతున్నారు. దీనిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భారతి వివరణ కోరగా, బుధవారం జరిగిన సంఘటన తన దృష్టికి వచ్చిందని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

29న కలెక్టరేట్ వద్ద ధర్నాకు తరలిరండి

ఉపాధి హామీ కూలీలకు సిఐటియు, వ్యకాస నేతల పిలుపు

నినాదాలు చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

ప్రజాశక్తి- పరవాడ

ఉపాధి హామీ కూలీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, ఐద్వా ఆధ్వర్యంలో ఈ నెల 29న అనకాపల్లి కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాకు కూలీలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. మండలంలోని పెదముషిడివాడ గ్రామంలో ఉపాధి హామీ పని ప్రదేశంలో కూలీలు సిఐటియు ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ కొలతలతో సంబంధం లేకుండా రోజుకు కనీస కూలి ప్రభుత్వం ప్రకటించిన రూ.272 ప్రతికూలీకి ఇవ్వాలని, ఏడాదికి 200 పని దినాలు కల్పించాలని, గతంలో ఉన్న సమ్మర్ అలవెన్స్, పనిముట్లకు డబ్బులు, మంచినీరు, టెంట్, మెడికల్ కిట్లు వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. పెదముషిడివాడలో తేనెటీగలు దాడిలో గాయపడ్డ కూలీలను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

కె.కోటపాడు : కేంద్రంలో మోడీ ప్రభుత్వం ఉపాధి కూలీల పొట్ట కొడుతుందని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు గాడి ప్రసాద్ విమర్శించారు. మండలంలోని గొండుపాలెం గ్రామంలో ఉపాధి హామీ పనులు జరుగుతున్న చెరువు వద్దకు బుధవారం ఆయన వెళ్లి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం గడిచిన బడ్జెట్లో ఉపాధి హామీ పథకానికి రూ.60 వేల కోట్లు కోత విధించిందని తెలిపారు. ఉపాధి నిధులతో చేపడుతున్న సచివాలయ భవనాలు, ఆర్‌బికెలు, సిమెంట్ రోడ్లు, కాలువలు తదితర నిర్మాణ పనులను విరమించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల మండల కన్వీనర్ ఎర్ర దేవుడు, ఉపాధి కూలీలు, మేట్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వ్యవసాయశాఖ ఎడి రవీంద్రబాబు

వారాడలో 'పొలం బడి'

ప్రజాశక్తి-కె.కోటపాడు

వ్యవసాయంలో రైతులు అధిక ఆదాయం పొందేందుకు కృషి చేయాలని, ఇందుకు వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు సూచనలు, సలహాలు పాటించాలని వ్యవసాయ శాఖ ఏడి రవీంద్రబాబు తెలిపారు. బుధవారం వారాడలో క్లస్టర్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందడానికి రైతులు ఆధునిక పద్ధతులు అవలంభించాలన్నారు. క్లస్టర్ పొలంబడిలో వారాడ గ్రామాన్ని ఎంపిక చేశారని, 14 వారాలపాటు చేపట్టే ఈ కార్యక్రమంలో రైతులు ఉత్సాహంగా పాల్గొని అధికారులు శాస్త్రవేత్తలు సూచనలు పాటించాలని కోరారు. 250 ఎకరాలలో 9 గ్రామాలను అనుసంధానం చేస్తూ ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. రైతులు ఎస్హెచ్‌జి సంఘాలను ఏర్పాటు చేసుకుని ప్రభుత్వ అందించే రాయితీలను పొందవచ్చునని చెప్పారు. జిల్లా వనరుల కేంద్రం ఏడి దాసు, పొలంబడి రిసోర్స్ పర్సన్ చిరంజీవి, వ్యవసాయ అధికారులు సోమశేఖర్, పి.విజేత, తులసి, కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ రాజకుమార్, డాక్టర్ కిషోర్, ఆర్‌బికె ఇన్చార్జిలు, రైతులు పాల్గొన్నారు.

ఎపి రచయితల సంఘం ఉపాధ్యక్షులుగా మాధవీ సనారా

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లికి చెందిన ప్రముఖ రచయిత మాధవీ సనారా (శిలపరశెట్టి సత్యనారాయణ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రచయితల సంఘం ఉపాధ్యక్షులుగా ఎంపిక చేసినట్లు విజయవాడ నుంచి ఈ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు సోమేపల్లి వెంకట సుబ్బయ్య, చలపాక ప్రకాష్ బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సనారా ఈ పదవిలో 2026 వరకూ కొనసాగుతారని పేర్కొన్నారు. సనారా ఈ పదవికి ఎంపిక కావటం పట్ల అనకాపల్లి సాహితీమిత్రులు తమ హర్షం వ్యక్తం చేశారు.

పిల్లలకు నిల్వ గుడ్లు పెట్టడం సరికాదు

ప్రజాశక్తి-అనకాపల్లి : జివిఎంసి నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాల్లో చిన్నారులకు నిల్వ గుడ్లను పెట్టడం దారుణమని ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ డాక్టర్ చిన్నియాదవ్, అబ్దుల్ కలాం సేవాసంస్థ వ్యవస్థాపక చైర్మన్ ఆళ్ల ప్రవీణ్ కుమార్, అంబేద్కర్ సేవాసమితి జిల్లా కోఆర్డినేటర్ బండి అప్పారావు, రైతు సంఘం అధ్యక్షులు ఆడారి బుచ్చిరాము, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ బొబ్బిలి గోవిందరాజులు తదితరులు జీవీఎంసీ అనకాపల్లి జోన్ పౌర సమాచార శాఖ అధికారి సురేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. శిక్షణ తరగతులకు 5 సంవత్సరాల పిల్లలు కూడా వస్తున్నారని, వారు పాడైపోయిన గుడ్లను తినలేక ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిల్వ గుడ్లును తినడం వలన చిన్నారుల ఆరోగ్యం పాడైపోయే ప్రమాదం ఉన్నందని పేర్కొన్నారు. చిన్నారులకు మేలు రకమైన గుడ్లను సరఫరా చేయకపోతే ప్రజాసంఘాల తరపున ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.

పశువులకు వడదెబ్బ తగలకుండా చూడండి

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని బయ్యవరం రైతు భరోసా కేంద్రం వద్ద పశువిజ్ఞాన బడి బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కశింకోట పశు వైద్య అధికారి అల్ఫోన్స్ జార్జ్ మాట్లాడుతూ వేసవిలో పశువులు వడదెబ్బ బారిన పడకుండా సంరక్షించుకోవాలని సూచించారు. ప్రభుత్వం పశు బీమా పథకం (లైవ్ స్టాక్ ఇన్సూరెన్స్ స్కీం) ద్వారా పశు నష్ట పరిహారం చెల్లిస్తుందని చెప్పారు. రైతులందరూ తమ సమీప ఆర్‌బికెలో పశు బీమా పథకంలో నమోదు చేసుకోవాలని కోరారు. సంకరజాతి ఆవు, గేదె, ఎద్దు మరణిస్తే రూ.30వేలు, నాటు ఆవు, గేదె, ఎద్దు మరణిస్తే రూ.15వేలు, గొర్రె, మేక, పంది మరణిస్తే రూ.6000 నష్టపరిహారం ఇవ్వనున్నట్లు తెలిపారు. బిపిఎల్ చెందిన కుటుంబాల వారి పశువులకు మూడు సంవత్సరాలకు రూ.384 చెల్లించవలసి ఉంటుందన్నారు.

రోడ్డుకు అడ్డంగా పడిన చెట్లను తొలగిస్తున్న దృశ్యం

ఈదురుగాలులకు నేలకొరిగిన చెట్లు

తొలగించిన పోలీసులు

ప్రజాశక్తి- కె.కోటపాడు

బలంగా వీచిన ఈదురు గాలులకు బుధవారం మండలంలోని సూరెడ్డిపాలెం కాటా వద్ద రోడ్డుకు అడ్డంగా చెట్లు విరిగి పడడంతో ట్రాఫిక్ అంతరాయం కలిగింది. దీంతో ఎక్కడ వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. వర్షం కొద్దిగా పడినప్పటికీ ఈదురు గాలులు మాత్రం బలంగా వీచాయి. దీంతో మండలంలోని పలు గ్రామాలలో చెట్లు విరిగి నేలకొరిగాయి. ఆర్‌వై.అగ్రహారం ఎస్సీ కాలనీలో ఈదురు గాలులకు రెండు విద్యుత్ స్తంభాలు విరిగి నేలపడ్డాయి. సూరెడ్డిపాలెం కాటా వద్ద రోడ్డు మీద పడిన చెట్లను ఏ కోడూరు ఎఎస్‌ఐ. కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది., స్థానికులు యుద్ధ ప్రాతిపదికన తొలగించి ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు. దీంతో వాహందారులు రాకపోకలను కొనసాగించారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-చోడవరం

వాసవి క్లబ్, వనితా క్లబ్ ఆధ్వర్యంలో చోడవరం కొత్తూరు జంక్షన్‌లో బుధవారం మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వారు రూపొందించిన పేదలకు పెన్షన్ స్కీం కింద పేదలకు ఒక్కొక్కరికి రూ.200 చొప్పున పింఛన్లు అందించారు. మజ్జిగ చలివేంద్రాన్ని కలగర్ల శేషు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ ప్రెసిడెంట్ పసుమర్తి శేష అశోక్ సెక్రటరీ పుట్ట నరేష్, ట్రెజరర్ భోగవిల్లి గణేష్, మధు, పివిఎన్ లక్ష్మణరావు, పసుమర్తి మల్లిక్, రీజనల్ చైర్మన్ కందుకూరి నాగేశ్వరరావు, చిట్టూరి నాని, నాలం సత్యనారాయణమూర్తి, డైరెక్టర్ రేపాక ఆదినారాయణ, యూత్ క్లబ్ కమిటీ మణికుమార్, కేతవరపు రామకృష్ణ, పూసర్ల కిరణ్ పాల్గొన్నారు.

మజ్జిగ అందజేస్తున్న వాసవి, వనిత క్లబ్‌ల ప్రతినిధులు

ముగిసిన చిల్డ్రన్స్ క్లబ్ వేసవి శిబిరం

ప్రజాశక్తి -మునగపాక రూరల్

మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలో గల డావెన్సీ స్కూల్లో ఈ నెల 22 నుంచి 24 వరకు జరిగే వేసవి శిబిరాలు బుధవారంతో ముగిశాయి. విశాఖపట్నం చిల్డ్రన్స్ క్లబ్ వారు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో విద్యార్థులకు సమిష్టి తత్వాన్ని పెంచే గ్రూప్ యాక్టివిటీలు, సమాజం, శాస్త్రీయ ఆలోచనపై అవగాహన కల్పించడం జరిగింది. పర్యాటక ప్రాంతమైన కొండకర్ల ఆవలో బోటు ప్రయాణం జరిపి ప్రకృతి అందాలను పరిచయం చేశారు. విద్యార్థులకు నేటి సమాజం మంచి లక్షణాలు చెడు లక్షణాలు ఏమిటి? తరువాత పది సంవత్సరాల తర్వాత ఈ సమాజం ఎలా ఉండాలి? పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలు వాటి పరిష్కార మార్గాలు అనే అంశాలపై చర్చించి, వివరించారు. అనకాపల్లి రోటరీ క్లబ్ ప్రెసిడెంట్, గవర్నర్ ,సెక్రటరీ శిబిరాన్ని సందర్శించి విద్యార్థులను ప్రశంసించి తినుబండారాలను పంపిణీ చేశారు. మంగళవారం రాత్రి తిమ్మరాజుపేట గ్రామంలో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. శ్రమ, సంస్కృతిని గురించి తెలియజేసే నా చెమట చుక్క, కులం, మతం అసమానతల నుంచి విముక్తి కోసం అంటూ, ఆజాదీ గిరిజన జీవనం డిబిరి డిబిరి, ఏం కొనేటట్టు లేదు ఏం తినేటట్టు లేదు, మతసామరస్యం, మహిళా సాధికారత వంటి గీతాలు ఆలపించి పలువురిని ఆకట్టుకున్నాయి. బాల్యంలో దేశభక్తి, శ్రమ విలువలను మరిపించే చక్కటి ప్రదర్శనలకు కనువిందు చేశాయి. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శరగడం శివ బాబు నాయుడు, మాజీ సర్పంచ్ కర్రి అప్పారావు, గ్రామ రైతు సంఘం అధ్యక్షులు భీమిశెట్టి రాము, ఆడారి రామకృష్ణ, శరగడం నాగేశ్వరరావు, బుద్ధ రంగారావు, వివిసి కన్వీనర్ కె.సుశీల, కల్చరల్ కమిటీ సభ్యులు ఎస్ రష్మిక, డి శైలజ, తేజ, సాయి కుమార్, సభ్యులు నిఖిల్, గుణ, శశి, జగదీష్, భారతి, కుమారి, కొండమ్మ, ఎల్లాజీ తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిబిరంలో పాల్గొన్న చిన్నారులు

ప్రజా సమస్యలు పరిష్కారం

ప్రారంభోత్సవం చేస్తున్న మంత్రి అమర్‌నాథ్

ప్రజాశక్తి- కశింకోట

ప్రజా సమస్యలను పరిష్కరించేందుకే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మండలంలోని చెరకాం గ్రామంలో బుధవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గంలో గతంలో ఎన్నడు లేని విధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల వాలంటీర్లకు ప్రకటించిన సేవా రత్న, సేవా వజ్ర అవార్డులు అందుకున్న వారిని మంత్రి ఘనంగా సన్మానించారు. ముందుగా రూ.20 లక్షలతో వేసిన అంతర్గత సిమెంట్ రోడ్లు, 5 లక్షలతో నిర్మించిన పంచాయతీ భవనం ప్రారంభం చేశారు ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షురాలు కలగా లక్ష్మి, జెడిపిటిసి దంతులూరి శ్రీధర్ రాజు, సర్పంచ్ కలగా గున్నయ నాయుడు, వెన్నెల చిన దేముళ్ళ, నరిశింగబిల్లి సహకార బ్యాంకు పర్సన్ ఇన్ చార్జి గండి నాయుడు బాబు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'భూ కబ్జాల్లో అమర్‌నాథ్, బొడ్డేడ ప్రధాన పాత్ర'

మాట్లాడుతున్న టిడిపి నాయకులు సురేంద్ర తదితరులు

ప్రజాశక్తి- అనకాపల్లి

అనకాపల్లి ప్రాంతంలో జరుగుతున్న భూకబ్జాలలో రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్నాథ్, గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్‌ది ప్రధాన పాత్ర అని టిడిపి రాష్ట్ర బీసీ సాధికార కమిటీ కన్వీనర్ మళ్ళ సురేంద్ర, టిడిపి నాయకులు బిఎస్ఎంకె.జోగినాయుడు, పోలారపు త్రినాథ్, సబ్బవరపు గణేష్, కాండ్రేగుల రాజు ఆరోపించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ మంత్రికి చిత్తశుద్ధి ఉంటే విస్సన్నపేట భూకుంభకోణంపై సిట్ వేసి దర్యాప్తు వేయాలని సవాల్ విసిరారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణను విమర్శించే నైతిక హక్కు వైసిపి నాయకులకు లేదన్నారు. మంత్రి గుడివాడ అమర్నాథ్‌కు బొడ్డేడ ప్రసాద్ బినామీ అని నియోజకవర్గంలో చిన్న పిల్లాడిని అడిగినా చెబుతారని పేర్కొన్నారు. బొడ్డేడ ప్రసాద్ పూటకో పార్టీ మార్చే ఊసరవెల్లి అని ఆరోపించారు. కమీషన్ల కోసమే వైసిపి నాయకులు ఆర్ఇసిఎస్‌ను భ్రష్టు పట్టించారని తెలిపారు. విస్సన్నపేటలో 17మంది దళితుల భూములను కబ్జా చేశారని, దళితులు పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదన్నారు. వెంటనే దళితుల భూములను తిరిగి ఇవ్వకపోతే మంత్రి గుడివాడ అమర్నాథ్, చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ ఇళ్లను బాధిత దళితులతో కలిసి ముట్టడిస్తామని హెచ్చరించారు.

'నూకాంబిక బంగారాన్ని మింగిన ఘనుడు పీలా'

ప్రజాశక్తి-అనకాపల్లి

మాట్లాడుతున్న బొడ్డేడ ప్రసాద్

ఉత్తరాంధ్ర ఇలవేల్పు శ్రీనూకాంబిక అమ్మవారి బంగారాన్ని మింగిన ఘనుడు, 420 పీలా గోవింద సత్యనారాయణ అని ఆర్ఇసిఎస్ మాజీ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ విమర్శించారు. స్థానిక విజయ రెసిడెన్సీలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము కబ్జా చేశామని ఆరోపిస్తున్న పీలా, దేవీపురం పెందుర్తి నామవరం, ఆనందపురం భూములపై హైకోర్టులో పిటిషన్ వేసేందుకు సిద్ధమా అని సవాల్ విసిరారు. నూకాంబిక అమ్మవారికి బంగారు కిరీటం చేయిస్తామని చెప్పి అనకాపల్లి బంగారం వ్యాపారస్తుల నుంచి వసూలు చేసిన దానిలో సగం బంగారాన్ని ఎగ్గొట్టిన ఘనత పీలా గోవిందకే దక్కుతుందన్నారు. పీలా చేసిన అక్రమాలు, కబ్జాలు అందరికీ తెలిసినవేనని, ఇకపై మంత్రి అమర్నాథ్‌ను విమర్శిస్తే పీలా చేసిన అక్రమాలు రోజుకొకటి వెలుగులోకి తెస్తామని హెచ్చరించారు. సమావేశంలో వైసిపి పట్టణ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు, కసింకోట జడ్పిటిసి సభ్యుడు దంతులూరి శ్రీధర్ రాజు, కసింకోట ఎంపీపీ కలగా లక్ష్మి గున్నయ్య నాయుడు, వైసిపి నాయకులు పలక రవి, జాజుల రమేష్, బొడ్డేడ శివ, శ్రీనివాసరావు, మలసాల కిషోర్, వెంకుపాలెం సర్పంచ్ రాపేటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పశుబీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి- అనకాపల్లి : రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వైయస్సార్ పశు బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ సౌజన్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బీమాతో వివిధ రకాల వ్యాధులు, ప్రమాదవశాత్తు పశువులు, జీవాలు, పందులు మరణిస్తే రైతులకు బీమా చెల్లించనున్నట్లు చెప్పారు. ఈ పథకానికి తెల్ల రేషన్ కార్డు ఉన్నవారు బీమా సొమ్ములో 20 శాతం, లేనివారు 50 శాతం ప్రీమియం చెల్లించాలన్నారు. పశువులకు మూడేళ్లపాటు, జీవాలు పందులకు ఒకటి నుంచి మూడు సంవత్సరాల పాటు ఈ బీమా వర్తిస్తుందన్నారు. పశువులు మరణించిన 21 రోజుల్లోపుగా బీమా నష్ట పరిహారం లబ్ధిదారుని ఖాతాలో జమ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

నాణ్యతతో ఆలయ పునర్నిర్మాణం

ప్రజాశక్తి-అనకాపల్లి : నూకాంబిక అమ్మవారి ఆలయ పునర్నిర్మాణం నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ ఆదేశించారు. బుధవారం ఆయన నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారి మధ్యాహ్న హారతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేద పండితులు విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ పనులకు సంబంధించిన వివరాలను ఆలయ ఈవోను అడిగి తెలుసుకున్నారు. పనులలో నాణ్యత లోపం లేకుండా చూడాలని, త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మందపాటి జానకి రామరాజు, ఎంపీపీ గొర్లి సూరిబాబు, దాడి జయవీర్, జాజుల రమేష్, గైపూరి రాజు, ఎండోమెంట్ సహాయ కమిషనర్ సుజాత, ఈవో బండారి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో పాత్రికేయుడు లక్ష్మీప్రసాద్ మృతి

ప్రజాశక్తి- సబ్బవరం

మండలంలోని సీనియర్ పాత్రికేయులు, విశాలాంధ్ర విలేకరి గోటేటి లక్ష్మి ప్రసాద్ బుధవారం మృతి చెందారు. కొంతకాలంగా లక్ష్మి ప్రసాద్ అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఇటీవల ఆరోగ్యం విషమించడంతో విశాఖలోని చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. లక్ష్మి ప్రసాద్ 1988లో పాత్రికేయ వృత్తిలో చేరారు. 1988లో ఈనాడు విలేకరిగా ప్రస్థానం ప్రారంభించి తర్వాత ఆంధ్రజ్యోతి, వార్త, సూర్య దినపత్రికలలో విలేకరిగా పనిచేశారు. ఈయన ఏపీడబ్ల్యూజే జిల్లా కమిటీ సభ్యునిగా, మండల అధ్యక్షునిగా పలు పదవులు చేపట్టి సేవలందించారు. లక్ష్మి ప్రసాద్‌కు భార్య సీత, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు భరద్వాజ్ పుట్టుకతోనే మానసిక దివ్యాంగులు కావడంతో ప్రసాద్ కుమారుడికి సేవలందించే వారు. ప్రసాద్ మరణంతో కుమారుడి జీవితం అగమ్యగోచరంగా మారింది. లక్ష్మిప్రసాద్‌కు ఉత్తరాంధ్ర జర్నలిస్ట్ ఫ్రంట్ అధ్యక్షులు ఎంఆర్ఎన్ వర్మ, పలువురు జర్నలిస్టులు శ్రద్ధాంజలి ఘటించి నివాళులర్పించారు.

వికలాంగ పిల్లలకు కుర్చీలు వితరణ

ప్రజాశక్తి -బుచ్చెయ్యపేట

మండలంలోని దిబ్బిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక అవసరాలుగల పిల్లల సహిత విద్య వనరుల కేంద్రానికి, చోడవరానికి చెందిన జస్వంత్ ప్లాస్టిక్స్ యజమాని దొడ్డి ప్రసాద్ కుమారుడు బాలాజీ కుమార్ జ్ఞాపకార్థం 10 కుర్చీలను సమకూర్చారు. వీటిని పాఠశాల ప్రత్యేక ఉపాధ్యాయుడు బిఎ. రాజుకు బుధవారం అందించారు. వారికి ప్రధానోపాధ్యాయులు బి. కాశీ శంకర విశ్వేశ్వరరావుఅభినందనలు తెలియజేశారు.

కుర్చీలు అందజేస్తున్న దొడ్డి ప్రసాద్

అభివృద్ధి పనులు ప్రారంభం

అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-అచ్యుతాపురం

ఏషియన్ పెయింట్స్ అంబుజా సిమెంట్ ఆధ్వర్యంలో 1,31,60,000తో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు బుధవారం ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు ప్రారంభించారు. ఏషియన్ పెయింట్స్ కేటాయించిన సిఎస్ఆర్ నిధులతో దుప్పుతూరు గ్రామ పరిధిలో రూ.38 లక్షల నిధులతో చెరువు అభివృద్ధి పనులు చేశారు. భోగాపురం గ్రామంలో రూ.15.50 లక్షలతో చెరువు పనులు, మడుతూరులో రూ.34 లక్షలతో చెరువు మరమ్మతు పనులు చేశారు. ఎర్రవరం గ్రామంలో రూ.18.60తోనూ, నునపర్తి గ్రామంలో రూ.15 లక్షలతోనూ, తంతడి గ్రామంలో రూ.11 లక్షలతోనూ చెక్ డాం నిర్మాణం చేశారు. పైన పేర్కొన్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ యు.సుకుమార వర్మ, వైసిపి నాయకులు దేశంశెట్టి శంకర్రావు, సర్పంచులు చుక్క అనురాధ, ఎం సంజీవ్, కె విమల నాయుడు, ఎంపీటీసీ సభ్యుడు శనివాడ జువ్వాల నాయుడు, కోన లచ్చన్నాయుడు, లాలం రాంబాబు, పిన్నమరాజు వాసు, జి నూకరాజు, ఎన్ కుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి -అనకాపల్లి

జీవీఎంసీ 82వ వార్డులో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను బుధవారం ఆ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత, జోనల్ కమిషనర్ వెంకటరమణ, వైసిపి పట్టణ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు పరిశీలించారు. ముందుగా గాంధీనగరం ఇన్‌కామ్ టాక్స్ వీధిలో రూ.50 లక్షలతో జరుగుతున్న రహదారి, కాలువల నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం లయన్స్ క్లబ్ వీధిలో ఉన్న గాంధీ పార్కును సందర్శించారు. పార్కులో పేరిగిపోయిన చెత్త ఎప్పటికప్పుడు తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్ వెంకటరమణను కోరారు. తరువాత గాంధీ నగరం అంజయ్య కాలనీలో కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రహదారి, కాలువల నిర్మాణంలో నాణ్యత, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. కార్యక్రమంలో ఏఈ సుమిత్ర, విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్, వైసిపి నాయకులు కొండూరు రవీంద్రనాథ్, కడిమిశెట్టి సతీష్, ఆళ్ల నాగేశ్వరరావు, గైపూరి రాజు, ఆకుల సంతోష్, అల్లుమల్ల జయరామ్, ఏడువాకల నూకమ్మ, మెలిపాక దుర్గ, డొంక సత్తిబాబు, రాయవరపు జోగిరాజు, కోన ఉమ, పేలూరు కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

జగనన్న కాలనీలో జియో టాగింగ్

ప్రజాశక్తి- అనకాపల్లి : రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇల్లు మంజూరు చేశారని 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ భాస్కరరావు అన్నారు. మండలంలోని కోడూరులో జగనన్న ఇళ్ల కాలనీ లబ్ధిదారులకు జియో టాగింగ్ చేశారు.కార్యక్రమంలో పెంటకోట సన్యాసినాయుడు, కర్రి మోది నాయుడు, పెంటకోట అప్పలనాయుడు, పోలమరశెట్టి నాగు, పెంటకోట సాగర్, పెంటకోట తేజ, కోన శివకృష్ణ, హౌసింగ్ డిపార్మెంట్ ఏఈ, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

రక్తహీనత లేకుండా చూసుకోవాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు : గర్భిణులు రక్తహీనత లేకుండా చూసుకోవాలని చౌడువాడ పీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ నిర్మల అన్నారు. మండలంలోని కింతాడ పంచాయతీ శివారు గొల్లలపాలెంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, కిశోర్ బాలికలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని, డాక్టర్లు ఇచ్చిన మందులు సకాలంలో వాడాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో శచీదేవి, ఎంపిహెచ్ఈఓ రాజశేఖర్, మూర్తి పాల్గొన్నారు.

మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

గోడ కూలి వ్యక్తి మృతి

ప్రజాశక్తి అచ్యుతాపురం

మండలంలోని మోసయ్యపేట గ్రామంలో బుధవారం కర్రల మిల్లుకు చెందిన గోడ కూలి ముచ్చు గోవిందా (55) మృతి చెందాడు. సంఘటనా స్థానానికి పోలీసులు చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గోవింద మృతితో గ్రామంలో విషాదఛాయలు అమ్ముకున్నాయి.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం కోటవీధిలో చోడవరం కోటవీధిలో భవన నిర్మాణ పనులు చేస్తుండగా గోవిందమ్మ కాలనీకి చెందిన నాగులపల్లి కన్నం నాయుడు (45) విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. కన్నంనాయుడు కోటవీధిలో సీమసిరి ఈశ్వరరావు ఇంటికి తాపీ పని కోసం వెళ్లాడు. ఇంటి 1వ అంతస్తులో అల్యూమినియం టూల్ (గజం బద్ద)తో స్నానపు గది గోడను నిర్మిస్తుండగా, ప్రమాదవశాత్తు అతని అల్యూమినియం టూల్ (గజం బద్ద) విద్యుత్ స్తంభానికి సమీపంలోని లైవ్ వైర్‌కు తగలడంతో విద్యుత్ షాక్ తగిలింది. దీంతో అతను 1వ అంతస్తు నుండి నేలపై పడిపోడి మృతి చెందాడు. దీనిపై స్థానిక ఎస్ఐ సూర్యనారాయణ కేసు నమోదు చేసి మృతదేహాన్ని అనకాపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-అనకాపల్లి : టిడిపి వ్యవస్థాపకులు ఎన్.టి.రామారావు శత జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆ పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగజగదీశ్వరరావు పిలుపునిచ్చారు. బుధవారం టిడిపి కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలను గురువారం సాయంత్రం 4 గంటలకు అనకాపల్లి నూకాంబిక ఆలయం వీధిలో ఉన్న శ్రీసత్యస్ లక్ష్మీ గ్రాండ్ హాల్లో నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ముఖ్య అతిథులుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ స్పీకర్ ప్రతిభ భారతి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు, వంగల పూడి అనిత, ఇతర నాయకులు పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు లాలం కాశి నాయుడు, కడిమిశెట్టి నర్సింగరావు, ఏపిఎం సత్యనారాయణ, బొలిశెట్టి శ్రీనివాసరావు, కాండ్రేగుల సత్యనారాయణ, కొట్ని రామకృష్ణ, మళ్ల శివన్నారాయణ పాల్గొన్నారు.

అందరికీ సంక్షేమ ఫలాలు

ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

ప్రజాశక్తి -రావికమతం:ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించడమే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ధ్యేయమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విప్, చోడవరం శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ అన్నారు. మండలంలోని మేడివాడ పంచాయతీ శివారు అప్పలమ్మపాలెం గ్రామంలో బుధవారం గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ధర్మ శ్రీ ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు అందరికీ అందుతున్నదీ లేనిదీ ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. ఎవరికైనా అందక పోతే వెంటనే ఆయా పథకాలను అందించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ప్రజలందరికీ ఒకే రకమైన న్యాయం జరగాలన్న ఉద్దేశంతో ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పైల రాజు, మండల పార్టీ అధ్యక్షుడు మహాలక్ష్మినాయుడు, మండల కన్వీనర్ జగ్గారావు, మాజీ జడ్పిటిసి ఆసరి గోవిందరావు, పలువురు సర్పంచులు, ఎంపిటిసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్యటిస్తున్న ధర్మశ్రీ

మాట్లాడుతున్న ఎంపిడిఒ చంద్రశేఖర్

సకాలంలో పోషకాహారం అందించాలి

ప్రజాశక్తి -కోటవురట్ల:గర్భిణులకు, చిన్నారులకు సకాలంలో పోషకాహారం అందజేయాలని ఎంపీడీవో చంద్రశేఖర్ సూచించారు. బుధవారం ఆయన మండలంలోని ఎండపల్లి గ్రామంలో అంగన్వాడి కేంద్రాలను సందర్శించారు. ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని విద్యార్థులకు క్రమం తప్పకుండా అందజేయాలని సూచించారు. చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పోషకాహార వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ రాఘవ పాల్గొన్నారు.

నక్కపల్లి:మండలంలోని జానకయ్యపేట లో అంగన్వాడీ కేంద్రాన్ని బుధవారం ఎంపీడీవో సీతారామరాజు, ఈ ఓ పి ఆర్ డి వెంకటనారాయణ సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. చిన్నారులకు, గర్భిణీ, బాలింతలకు పోషకాహారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్, ఏఎన్ఎం, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి -ఎస్.రాయవరం:మండలంలోని సర్వసిద్ధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి పలు గ్రామ సచివాలయాల్లో యాంటీ టీబీ డే పురస్కరించుకొని అవగాహన శిబిరాలు నిర్వహించినట్లు మెడికల్ ఆఫీసర్లు ఎస్ఎస్వి శక్తిప్రియ, వాసంతి తెలిపారు. ఆరోగ్య విస్తరణ అధికారి బి సత్యనారాయణ పర్యవేక్షణలో ఎస్.రాయవరం గ్రామ సచివాలయం వద్ద నిర్వహించిన అవగాహన శిబిరంలో ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ క్లినిక్ క్లస్టర్ పర్యవేక్షకులు, మలేరియా ఇంఛార్జి నోడల్ ఆఫీసర్ పిఏవిఎస్ ప్రసాద్ మాట్లాడుతూ, రెండు వారాలకు మించి దగ్గు, క్రమేణా బరువు తగ్గిపోవడం, తరచుగా జ్వరం, కళ్లెతోపాటు రక్తపు జీర కనపడటం వంటివి క్షయ వ్యాధి లక్షణాలు అన్నారు. ఈ లక్షణాలు కనిపించిన వెంటనే సమీపంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు వెళ్లి న పరీక్షలు చేసుకోవాలన్నారు.ఈ వ్యాధి దగ్గడం, తుమ్మడంతో వ్యాప్తి చెందే అవకాశమున్నందున ప్రతి ఒక్కరు మాస్క్ ధరించాలని సూచించారు.ప్రభుత్వం హాస్పిటల్లో ప్రతి నెల ఆరు నెలల పాటు మందుల కోర్స్తో పాటు ఐదు వందలు ఫోషకాహారం నిమిత్తం ఇస్తారని ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సచివాలయం హెల్త్ సెక్రటరీలు పి.నూకరత్నం, పి.శ్రీరాములు, గ్రామ పెద్దలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న వైద్యులు

విరాళం అందిస్తున్న నేతలు

ఆలయం నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి-మాడుగుల:ఆలయ నిర్మాణానికి జన సేన నేత రాయపూర్ రెడ్డి కృష్ణ విరాళం అందించారు. పోతనపూడి గ్రామంలో నిర్మాణం అవుతున్న పైడితల్లమ్మ ఆలయానికి ఆయన బుధవారం రూ.5116లు విరాళం అందించారు.ఈ కార్యక్రమంలో ఆర్లి సురేష్, కోరుకొండ సాంబ మూర్తి, కోరుకొండ సూరి అప్పారావు, పెంట కోట రాము, మడగల వెంకటరమణ, కోరుకొండ రామ నాయుడు, కోరుకొండ శ్రీనివాసరావు, వేపాడ రాజు, శ్రీను, రామారావు, శ్రీను, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు..

అనారోగ్యంతో మహిళా పోలీస్ మృతి

ప్రజాశక్తి -గొలుగొండ: మండలంలో లింగంపేట సచివాలయంలో మహిళా పోలీస్గా పనిచేస్తున్న కొరుప్రోలు కృష్ణవేణి (28) అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందారు. గొలుగొండ మండలం చోద్యం గ్రామానికి చెందిన ఆమెకు 8 సంవత్సరాల క్రితం అమ్మపేట గ్రామానికి చెందిన గొర్లి నాయుడును వివాహం చేసుకున్నారు. ప్రస్తుతం నాలుగవ నెల గర్భవతి. మంగళవారం విధులు నిర్వహించిన అనంతరం ఇంటికి వెళ్ళాక ఆమెకు రక్తస్రావం కావడంతో వైద్య సేవల కోసం కుటుంబ సభ్యులు నర్సీపట్నం తీసుకు వెళ్లారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్య సేవలు కోసం విశాఖపట్నం తరలిస్తుండగా రక్తస్రావం అధికంగా కావడంతో మార్గమధ్యలోనే మృతి చెందారు. ఆమె భర్త సెంటర్ జైల్ పోలీస్ కానిస్టేబుల్గా విధులు నిర్వహిస్తున్నారు. విధులు నిర్వహిస్తున్న సచివాలయంలో అందరితో కలిసి మెలిసి ఉండే కృష్ణవేణి అకస్మాత్తుగా మృతి చెందడంతో లింగంపేట గ్రామస్తులు, సొంత గ్రామమైన అమ్మపేటలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

కృష్ణవేణి(ఫైల్ ఫోటో)

ఎమ్మెల్యేను సత్కరిస్తున్న సభ్యులు

సిఎం జగన్కు కృతజ్ఞతలు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: 1998 డిఎస్సీ అభ్యర్థులకు ఎంటిఎస్ పద్ధతిలో 4072 మందికి ప్రభుత్వం ఉద్యోగ కల్పన చేసినందుకుగాను సీఎం జగన్ మోహన్ రెడ్డికి అసోసియేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేసారు. బుధవారం ఎంటిఎస్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ను సత్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ, తమకు కల్పించిన ఉద్యోగ సర్వీస్ను 62 సంవత్సరాలు పొడిగించాలని , 12 నెలలు జీతాలు వచ్చేలా ప్రయత్నం చేయాలని ఎమ్మెల్యేను కోరారు. 25 సంవత్సరాల సర్వీసును నష్టపోయిన కారణంగా రిటైర్మెంట్ అనంతరం పింఛన్ రూపంలో న్యాయం చేయాలని కోరారు. ప్రస్తుతం జరుగుతున్న బదిలీల్లో భాగంగా తమ ఉపాధ్యాయులను మైదాన ప్రాంతంలో బదిలీ చేయాలని ఎమ్మెల్యేకు వినతి పత్రాన్ని అందించారు. ఈ మేరకు ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఈ విషయాలను సీఎం జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎల్ నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాసరావు, కోశాధికారి అప్పలనాయుడు, సభ్యులు సీతయ్య దొర, అప్పలనాయుడు, రాజ్యలక్ష్మి, భారతి తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై ర్యాలీ

ప్రజాశక్తి-రావికమతం:రోడ్డు ప్రమాదాల నివారణ పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని కవగుంట సర్పంచ్ దాసరి సూర్యకుమారి వరహాలు అన్నారు. మండలంలోని కవగుంట గ్రామంలో బుధవారం సర్పంచ్ ఆధ్వర్యంలో డ్వాక్రా సంఘ సభ్యులు, గ్రామ ప్రజలకు రోడ్డు ప్రమాదాల భద్రతపై పలు నినాదాలు చేస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణ పై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, అనేకమంది ప్రజలు రోడ్డు ప్రమాదాలలోనే మరణించడం జరుగుతుందని అన్నారు. రోడ్డు సూచికలను పాటిస్తూ ప్రయాణాలు చేయాలన్నారు. రోడ్డును దాటేటప్పుడు చిహ్నాలను చూసుకొని నడవాలన్నారు. యువత ర్యాష్ డ్రైవింగ్ చేయడంతో అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబరు రాబ్బా వరకుమారి, వివిఎ మహేష్ పాల్గొన్నారు.

కొనసాగిన వేసవి శిబిరాలు

గొలుగొండలో యోగా చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి-గొలుగొండ: యోగాతో విద్యార్థులు ఏకాగ్రతను పెంపొందించుకోవచ్చని మండల సీఆర్పీ రామకృష్ణ సూచించారు. స్థానిక గ్రంథాలయంలో విజయవంతంగా కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో బుధవారం ఆయన విద్యార్థులకు యోగాతో ఉపయోగాలను వివరించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో విద్యార్థులతో గ్రంథాలయ అధికారి రాజబాబు కథలు చెప్పించి, పాటలు పాడించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోటవురట్ల:వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా బుధవారం కొడవట్ల శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. చిన్నారులకు పలు అంశాలపై ప్రశ్నలు సంధించింది సమాధానాలు రాబట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు అన్ని విషయాలు పట్ల ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో బివిఎస్ ప్రసాద్, శాఖ గ్రంథాలయ అధికారి అప్పలనాయుడు పాల్గొన్నారు.

నాణేల ప్రదర్శన

నర్సీపట్నం టౌన్ :స్థానిక శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ప్రభాకరరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు పూర్వ నాణేలు ప్రదర్శన ఇచ్చారు. వాడుకలో లేని నాణెములను, చెలామణిలోని లేని నాణెములను పిల్లలకు చూపించారు. పిల్లలందరూ ఉత్సాహంగ తిలకించారు.ఆచంట. రాజేశ్వరి, శ్రీ గీత సంగీత ప్రచార కార్యదర్శి లక్ష్మి సంగీతం ప్రాముఖ్యతను వివరించారు. త్యాగరాజు, అన్నమయ్య, భద్రాచల. రామదాసు గార్ల రచనలను పిల్లలకు వివరించారు. గ్రాధాలయధికారిని దమయంతి ఎండ తీవ్రత లో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు .

నర్సీపట్నంలో నాణేల ప్రదర్శన

మునగపాక రూరల్ : వేసవి విజ్ఞాన శిబిరాలలో భాగంగా స్థానిక శాఖ గ్రంథాలయంలో బుధవారం ఉపాధ్యాయులు శివకోటి దుర్గాప్రసాద్ విద్యార్థులకు యోగ, మెడిటేషన్పై శిక్షణ ఇచ్చారు. నిజ జీవితంలో ఆరోగ్యానికి, మానసిక వికాసానికి ఈ ఆసనాలు ఉపయోగపడతాయని తెలిపారు. అనంతరం విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. గ్రంథాలయాధికారి ఎల్వి రమణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి ఎం.పద్మావతి విద్యార్థులచే నీతి కథలు చదివించడం చేశారు. క్యారమ్స్, కర్రీ ఆటలు ఆడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరంలో నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ముగింపు రోజు జూన్ 11న బహుమతులు ప్రదానం చేయడం జరుగుతుందని తెలిపారు.

ములగాడ : నీతి,నిజాయితీగా ఉండడం, జీవితంలో కష్టాలు వస్తే భయపడకుండా ధృఢనిశ్చయంతో వాటిని ఎదుర్కొని జీవించడం ఎంతో అవసరమని కార్మిక నాయకులు బి. సత్యానందం అన్నారు. మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా బుధవారం బాలలకు నీతి కథలను వివరించారు. అనంతరం సామాజిక సమస్యలపై కొన్ని కథలను రచయిత కె.సత్తిరాజు వివరించారు. ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రాం అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి అధ్యక్షతన, లైబ్రేరియన్ వి.అజయకుమార్ సమన్వయంతో నిర్వహించిన కార్యక్రమంలో నీతి కథలు చెప్పిన చిన్నారులకు ఎన్ఎస్ఎస్ అధికారి వై.అనసూయాదేవి బహుమతులు అందజేశారు.

'రియల్'వ్యాపారులకు పట్టాలు రద్దుచేయాలి

సిపిఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యాన ఆదివాసీల నిరసన

ప్రజాశక్తి -రోలుగుంట:సాగులో ఉన్న గిరిజనులను హక్కు పట్టాలు ఇవ్వకుండా. రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ఇచ్చిన పట్టాలు తక్షణమే రద్దు చేయాలని కోరుతూ రోలుగుంట మండలం రత్నం పేట శివారు పనసల పాడుకు చెందిన ఆదివాసీ గిరిజనులు సిపిఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నిరసన చేపట్టారు. ఏళ్ల తరబడి సాగులో ఉన్న గిరిజనులకు కాకుండా సాగులో లేని వారికి పట్టాలు ఇవ్వడం పై. పనసలపాడు ఆదివాసి గిరిజనులు జగనన్నకు చెపుదాం. కార్యక్రమానికి ఫిర్యాదు చేశారు. అనంతరం గ్రామంలో చేతులు జోడించి జిల్లా కలెక్టర్ గారు. మా ఆదివాసి గిరిజనులకు జరిగిన అన్యాయంపై సమగ్ర దర్యాప్తు చేయాలని కోరుతూ. విన్నూత్నంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ, రోలుగుంట మండలం రత్నంపేట పంచాయితీ శివారు పనసలపాడు రెవిన్యూ పరిధిలో 12 కుటుంబాలు గత కొన్నేళ్లగా ఆ భూములలో సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. జగనన్న సమగ్ర భూ సర్వే కార్యక్రమం తీసుకు రావడంతో తమకు న్యాయం జరుగుతోందని సంబర పడ్డామని, సర్వే లో భూ స్వాములకు పట్టాలు ఇచ్చేందుకు చర్యలు చేపట్టడం తో తమకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రోన్ సర్వే ద్వారా తమకు న్యాయం జరుగుతుందని భావించి ఆదివాసులు సంబరం పడ్డామన్నారు.ప్రత్యేకించి అనకాపల్లి జిల్లా కలెక్టర్ గారు మా పనసలపాడు గ్రామానికి వచ్చి ఎటువంటి అవకతవకలు జరగకుండా సర్వే రికార్డ్స్ ప్రకారంగా సర్వే చేసి పనసలపాడు రెవెన్యూ పరిధిలోని సర్వే రికార్డ్స్ సెక్షన్ 9(2) ప్రకారం సర్వే చేసిన రిపోర్టుని రైతుల అభిప్రాయాలు తీసుకొని. డిఎల్ఆర్ డ్రాఫ్ట్ ల్యాండ్ రిజిస్టర్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ అధికారులు సర్వే నెంబర్ 6-1,6-9,8-1. నెంబర్లలో విస్తీర్ణం లో భూములు గిరిజనులు పట్టాదారులు సాగు దారులకు కాదని సాగులో లేనటువంటి వారికి పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వడం దారుణమన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు సమగ్ర సర్వే నిర్వహించి సాగు దారులు అయిన ఆదివాసులకు అన్యాయం చేయకుండా అక్రమంగా పట్టాలు పొందిన పట్టాలను వెంటనే రద్దు పరచి సాగు దారులుకు ఇవ్వాలని, అలాగే ఈ సమస్య పై అనకాపల్లి జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రత్యేక విచారణ నిర్వహించాలన్నారు. బాధిత ఆదివాసి గిరిజనులు చేతులు జోడించి కలెక్టర్ వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో గెమ్మిల చిన్నబ్బాయి, గెమ్మిలా అప్పారావు, చంద్రరావు, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

ఆందోళన చేపడుతున్న గిరిజనులు, నాయకులు

ఆవేదన వ్యక్తం చేస్తున్న ప్రజలు

సచివాలయంలో నిలిచిన సేవలు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన సచివాలయాల్లో ఇంటర్నెట్ సేవలు నిలిచి పోయాయి. దీంతో, మున్సిపాలిటీ ప్రజలు కొంత ఇబ్బందికి గురయ్యారు. నర్సీపట్నం మున్సిపాలిటీ స్థానిక కాపు వీధి 3వ సచివాలయంలో ఇంటర్నెట్ సదుపాయం లేక గత 15 రోజులుగా అన్ని రకాల సేవలు నిలిచిపోయాయి. దీంతో స్థానిక 4వ వార్డు, 5వ వార్డు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సచివాలయంకు సంవత్సరం నుండి ఇంటర్నెట్ బిల్లు చెల్లించక పోవడంతో నిలిచి పోయినట్లు తెలిసింది. ఇప్పటికైనా అధికారులు, నాయకులు చర్యలు తీసు కోవాలని ప్రజలు కోరుతున్నారు..

నివాళి అర్పిస్తున్న నాయకులు

సత్తిబాబు స్ఫూర్తితో పోరాటం

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :కామ్రేడ్ సత్తిబాబు స్ఫూర్తితో పోరాడదామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక ఎన్‌టిఆర్ స్టేడియంలో మున్సిపల్ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో సత్తిబాబు సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ, సత్తిబాబు 30 ఏళ్ళుగా నర్సీపట్నం మున్సిపాలిటీ, ముఠా, కాఫీ తదితర కార్మికుల సమస్యల పరిష్కారంకు నిరంతరం పని చేశారని కొనియాడారు. నమ్మిన సిద్ధాంతం మేరకు కడవరకూ శ్రమించారని, మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం, నిత్యం కార్మికులకు అండగా నిలిచారన్నారు. కార్మికులు ఐక్యంగా సత్తిబాబు స్ఫూర్తితో పోరాడాలన్నారు. రానున్న కాలంలో మున్సిపల్ కార్మికుల సమస్యల పై రాష్ట్ర స్థాయి ఉద్యమానికి సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు,మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు కుపరాల రాజు, బొర్రా శ్రీనువాసరావు, యమగిరి రాజుబాబు, జి. కుమార్, తదితర్లు పాల్గొన్నారు.

ఆణిముత్యం అవార్డుకు మేరీ ఎంపిక

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని ఎస్.మేరీ ఇంటర్మీడి యట్ ద్వితీయ సంవత్సరం పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చాటడంతో పాయ కరావుపేట నియోజక వర్గ స్థాయి అవార్డుకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ శైలజ తెలిపారు. కళాశాలలో హెచ్ఈ సి గ్రూపులో 864/1000 మార్కులు సాధించింది. ఈ మేరకు మేరీ జగనన్న ఆణిముత్యాలకు ఎంపిక కావడంతో రూ.15 వేల నగదు ప్రోత్సాహన్ని ప్రభుత్వం అందించనుంది. ఈ మేరకు ప్రిన్సిపల్ శైలజ, చరిత్ర అధ్యాపకులు అప్పారావుతో పాటు పలువురు అధ్యాపకులు, కళాశాల సిబ్బంది మేరీకు అభినందనలు తెలిపారు.

వైఎస్ఆర్ పశు బీమాతో రైతులకు మేలు

పశు వైద్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పుష్ప

ప్రజాశక్తి -రావికమతం: వైయస్సార్ పశు బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పుష్ప సూచించారు. ఈ సందర్భంగా బుధవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, పశువులకు ఒక సంవత్సరం పశు బీమా చెల్లించినట్లయితే మూడేళ్ల పాటు ఈ బీమా వర్తిస్తుందని ఆమె తెలిపారు. సంకరజాతి పశువులకు రూ.30,000 దేశీయ జాతి పశువులకు రూ.15,000, మేకలు ,గొర్రెలు ఒక్కొక్క దానికి 6వేల రూపాయల చొప్పున బీమా వర్తిస్తుందన్నారు. ఒక్కొక్క సమూహంలో ఐదు పశువుల వరకు, 50 గొర్రెల వరకుకు బీమా వర్తిస్తుందని తెలిపారు. పాడి ఆవులు రెండు నుండి పది సంవత్సరాలు వయసు కలిగి ఉండాలని, లేదంటే ఒక ఈత అయినా ఈని ఉండాలన్నారు. గేదెలు మూడు నుండి 12 సంవత్సరాలు వయస్సు కలిగి ఉండాలన్నారు. ఎద్దులు సంకరజాతి ఒకటి నుండి పది సంవత్సరాలు, దేశీయ జాతి రెండు నుండి పది సంవత్సరాలు, గొర్రెలు మేకలు ఆరు నెలలు వయసు కలిగిన వాటికి ఈ బీమా వర్తిస్తుందని ఆమె తెలిపారు. ఎస్సీ ఎస్టీలకు చెందిన రైతుల సంకరజాతి పశువులకు రూ.384, దేశీయ జాతి పశువులకు రూ.480 ,ఇతర వర్గాల వారికి సంకరజాతికి రూ.960 ప్రీమియం చెల్లించి బీమా పొందాలన్నారు. ఎస్సీ ఎస్టీ కులాలకు చెందిన వారి గొర్రెలు, మేకలకు మూడు సంవత్సరాలకి రూ.75, ఇతర వర్గాల వారు మూడేళ్లకు 188 రూపాయలు ప్రీమియం చెల్లించి ఈ బీమాను పొందవచ్చు అన్నారు.పశువులు రోడ్డు, రైలు ప్రమాదం, పలు రోగాలతో అనారోగ్యానికి గురి కావడం, పాముకాటు, అగ్నిప్రమాదం, వరదలు, తదితర ప్రమాదాలు కు గురైన వాటికి బీమా వర్తిస్తుందని ఆమె తెలిపారు.

కలప అక్రమ రవాణాపై విచారణ

ప్రజాశక్తి-గొలుగొండ: అక్రమ కలప రవాణాపై అటవీ శాఖ రాష్ట్ర విజిలెన్స్ డిఎఫ్ఒ రవిశంకర్ వర్మ బుధవారం గొలుగొండ కలప డిపోలో విచారణ చేపట్టారు. జనవరి 9న కొయ్యూరు మండలం కాకరపాడు, గొలు గొండ మండలం ఎర్రవరం చెక్ పోస్టుల గుండా కలప రవాణా జరిగింది. ఆ కలపను తూర్పుగోదావరి జిల్లా రౌతులపూడి సమీపంలో అటవీ అధికారులు పట్టుకున్నారు. 8000 రూపాయలు చలానా కట్టించుకోవలసిన అటవీ అధికారులు కేవలం 700 రూపాయలు చలానా కట్టుకొని కలపను విడిచిపెట్టారు. కలపను ఎందుకు అంత తక్కువ సొమ్ము చలానా కట్టించవలసిన అవసరం వచ్చిందో ఆయన విచారణ చేశారు. సిబ్బంది నిర్లక్ష్యం వెనుక కారణాలను విచారణ చేశారు. ఈ విషయంపై నివేదికను తయారు చేసి ఉన్నతాధికారులకు అందజేస్తామని ఆయన తెలిపారు.అనంతరం ఆయన కృష్ణ దేవి పేట రేంజ్‌లో ఉన్న నల్గొండ ప్లాంటేషన్ను, భీమవరం చెక్పోస్ట్ ను పరిశీలించారు. అల్లూరి సమాధులను సందర్శించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం డిఎఫ్ఓ రాజారావు, నర్సీపట్నం, కేడీ పేట రేంజర్లు లక్ష్మీ నర్సు, వెంకటరమణలు, డిఆర్వో రాజేష్, సెక్షన్ అధికారి లక్ష్మణరావు, ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న వర్మ

గ్రామీణ వైద్యులను ప్రభుత్వం గుర్తించాలి

మాట్లాడుతున్న వైద్యులు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: స్థానిక ఉమా నారాయణ చిన్నపిల్లల హాస్పటల్ ప్రాంగణంలో చిన్నపిల్లల ఆరోగ్యం, స్త్రీ గర్భవ్యాధులపై బిహెచ్ఎంపిఎ అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. వైద్యులు పుల్లేటికుర్తి మల్లికార్జున్ రావు, వందన, ఎంఎస్ రాజు పాల్గొన్నారు ముఖ్యఅతిథి రాష్ట్ర అధ్యక్షులు కర్రేళ్ల గణపతి రావు మాట్లాడుతూ, ఆర్ఎంపి, పిఎంపిలకు గుర్తింపు లేదన్నారు.వీరికి శిక్ష ఇచ్చి ప్రభుత్వ వైద్య ఆరోగ్య కార్యకర్తలుగానూ, హెల్త్ ప్రొవైడర్సగానూ చేయాలని డిమాండ్ చేశారు. 50 సంవత్సరాలు దాటిన సీనియర్ లకు 5000 రూపాయలు పెన్షన్ అందజేయాలని కోరారు. . ఈ విషయంపై ప్రభుత్వానికి అనేకమార్లు వినతిపత్రాలు అందజేసామని, నేటికీ స్పందన లేదన్నారు. గ్రామీణ వైద్యులకు జాతి స్థాయిలో గుర్తింపు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు కర్రేళ్ల గణపతి సత్యనారాయణ, ఉమ్మడి జిల్లా సెక్రెటరీ నేరెళ్ల సత్యనారాయణ, మండల అధ్యక్షులు, ఉమ్మడి జిల్లాల గ్రామీణ వైద్యులు పాల్గొన్నారు. ఆర్ట్స్ యూనివర్సిటీ మ్యాజిక్ బుక్ ఆఫ్ రికార్డ్‌లో డాక్టరేట్ అవార్డు గ్రహీత లక్ష్మణరావు దంపతులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్ఎంపీలు, జిల్లా అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పిహెచ్‌సి పనుల పరిశీలన

ప్రజాశక్తి -ఎస్.రాయవరం:మండలంలో సర్వసిద్ధి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న పిహెచ్‌సి భవనాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎ.హేమంత్ బుధవారం పరిశీలించారు. కొత్త పిహెచ్‌సి భవనంలో సదుపాయాలపై మెడికల్ ఆఫీసర్ ఎస్-ఎస్‌వి శక్తి ప్రియను అడిగి తెలుసుకున్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో అనుసరించవలసిన విధివిధానాలు, ప్రోటోకాల్స్‌పై సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం పాత పిహెచ్‌సిలో అటెండెన్స్, మూమెంట్ రిజిస్టర్లలు, ల్యాబ్, ఫార్మసీ లను తనిఖీ చేసి కొన్ని సూచనలు ఇచ్చారని మెడికల్ ఆఫీసర్ శక్తి ప్రియ తెలిపారు.

పరిశీలిస్తున్న డిఎం అండ్ హెచ్ఒ

మన్యంలో గాలివాన బీభత్సం

ప్రజాశక్తి -అనంతగిరి:మండలంలోని బుధ వారం ఉరుములతో కూడిన గాలివాన బీభత్సం కారణంగా పలుచోట్ల భారీ వృక్షాలు విరిగిపడ్డాయి.కొండిభ పంచాయతీ పరిధి బోరిబోరి వలస గ్రామంలో భారీ మామిడి చెట్టు ఇంటి సమీపంలో కూలి పోయింది. దీంతో, ఇళ్లల్లో ఉన్న ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. రోడ్డుకు అడ్డంగా చెట్టు విరిగి పడటంతో వాహనాల రాకపోకలకు అంతరయం ఏర్పడింది. మండలంలో కురిసిన గాలివాన బీభత్సంతో లుంగపర్తి పంచాయతీ దిగువ పట్టి ఎంపీపీ పాఠశాల ప్రహరీ గోడ కుప్ప కూలింది. పనులలో నాణ్యత లేక పోవడంతోనే గోడ నిర్మాణం చేపట్టి రెండేళ్లయినా కాకుండానే వర్షానికి దెబ్బతిని కూలి పోవడంతో గ్రామ ప్రజలు మండిపడ్డారు. సెలవు దినాలు కావడంతో విద్యార్థులకు ప్రమాదం తప్పింది.